విశాఖపట్టణం
మంగళవారం 21 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 87 వెల: రూ.5/- పేజీలు: 8


Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## వీఆర్ నిరీక్షణ సరికాదు

ఈ చర్య పోలీస్ అధికారులకు శిక్షలా మారింది

ప్రభుత్వం పునరాలోచన చేసి పోస్టింగ్ ఇవ్వాలి

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండ్



2

# అన్నా క్యాంటీన్‌లో చంద్రబాబు బర్త్ డే

### సతీమణితో కలసి అల్పాహారం స్వీకరణ

### ఒక రోజు భోజన ఖర్చుగా రూ. 76 లక్షలు విరాళం





(విజయవాడ - జయజయహే)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన జన్మదినం సందర్భంగా సోమవారం ఉదయం విజయవాడలోని పటమట అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఉదయం 9.30 గంటలకు పటమట హైస్కూల్ రోడ్డులోని రైతు బజార్ వద్ద ఉన్న క్యాంటీన్‌కు చేరుకున్న ఆయన, తన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి అక్కడ అల్పాహారం తీసుకున్నారు. సామాన్య ప్రజలతో కలిసి కూర్చుని అల్పాహారాన్ని స్వీకరించారు. సమయంలో సాధారణ పౌరులు, సిబ్బందితో కాసేపు ముచ్చటించారు. అన్న క్యాంటీన్లలో ఆహారం నాణ్యత అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన సతీమణి నారా భువనేశ్వరి రూ.76 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మొత్తంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో ఒక రోజు ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించారు. దీనివల్ల సోమవారం నాడు రాష్ట్రంలోని అన్ని క్యాంటీన్లలో పేదలకు మూడు పూటలా ఉచితంగా ఆహారం లభించనుంది. పేదలు, కార్మికులు, ప్రజల మధ్య సీఎం చంద్రబాబు తన జన్మదినాన్ని సాదాసీదాగా జరుపుకున్నారు. అన్న క్యాంటీన్ ..మిగతా 3లో



## బాప్ రే.. యమ క్రేజ్

### సోషల్ మీడియాలో మోడీ సన్సేషన్

### పోస్టు చేసిన వీడియోకు లక్ష మిలియన్ల వ్యూస్

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్రేజ్ మామూలుగా ఉండదు.. ప్రపంచ అగ్ర నేతల్లో ఒకరైన ప్రధాని మోదీకి సోషల్ మీడియాలో కోట్ల సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నారు. ఆయన చాలా ఆసక్తికర విషయాలను మైక్రోబ్లాగింగ్ సైట్లలో పంచుకుంటారు. నరేంద్ర మోదీ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్.. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్.. ఇలా చాలా ప్లాట్‌ఫామ్స్ లో ఏదైనా పోస్ట్ చేస్తే కోట్ల సంఖ్యలో వ్యూస్, లక్షల్లో లైకులు వస్తుంటాయి.. తాజాగా.. ప్రధాని మోదీ షేర్ చేసిన ఓ వీడియో.. జస్ట్ 24 గంటల్లో ఏకంగా లక్ష మిలియన్ వ్యూస్ దాటింది. అంటే.. అక్షరాల 10 కోట్ల వ్యూస్ వచ్చాయి. ఒక్కరోజులో ఇన్‌స్టాగ్రామ్ లో.. 10 కోట్ల వ్యూస్, 6.3 మిలియన్ల లైకులు, 1 మిలియన్ షేర్లు ఇలా.. ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ దూసుకెళ్తోంది. ఫేస్‌బుక్, ఎక్స్ లో కూడా విపరీతంగా వ్యూస్ వస్తున్నాయి. ఇంతకీ అది ఏ వీడియో ఏంటంటే.. ప్రధాని మోదీ స్వయంగా.. రుచికరమైన ఝల్‌మురి (మురుమురాలు) ని కొనుగోలు చేసి తిన్నారు. బెంగాల్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నా.. ఆయన ..మిగతా 2లో

# ఎన్డీఏ సీఎం ప్రమాణస్వీకారానికి వస్తా



### పునర్విభజన జరిగితే దక్షిణాదికే మేలు

### మహిళలకు వ్యతిరేకంగా ఏకమయ్యారు

### తమిళనాట ప్రచారంలో సీఎం చంద్రబాబు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తమిళనాడులో ఎన్డీయే కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచార బరిలోకి దిగారు. రెండు రోజుల పాటు ఆయన అక్కడ సుడిగాలి పర్యటన చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కోయంబత్తూరు, హోసూరు, చెన్నై , మదురై వంటి కీలక ప్రాంతాల్లో బహిరంగ సభలు, రోడ్ షోలలో పాల్గొని కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఆయన ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పర్యటనలో భాగంగా కోయంబత్తూరుకు ..మిగతా 3లో



## అమ్మో.. నిమ్మ..!

### అకస్మాతుగా పెరిగిన ధర

### ఇటీవల కిలో రూ. 30 మాత్రమే

### సమ్మర్ సీజన్‌లో రూ. 300కి పెంపు

2

## దగదర్తిలో ఎయిర్ పోర్టు

### నెల్లూరులో నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

### 1332 ఎకరాల భూమి అవసరమని అంచనా

(నెల్లూరు - జయజయహే)

రాష్ట్రంలో మరో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. త్వరలోనే పనులు కూడా మొదలుకానున్నాయి. నెల్లూరు జిల్లాలో దగదర్తి ఎయిర్‌పోర్ట్ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దాదాపు 1332 ఎకరాల్లో ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మించనుండగా.. దీనిని పోర్టులు, నేషనల్ హైవేలు, పారిశ్రామిక జోన్లకు అనుసంధానించనున్నారు. దీని వల్ల నెల్లూరు జిల్లా, చుట్టుపక్కల ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందనున్నాయి. లాజిస్టిక్స్, టూరిజం, దాని అనుబంధ రంగాలు మరింతగా అభివృద్ధి చెందనున్నాయి. దీంతో ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే జిల్లా దశదిశలు మారిపోతాయని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. త్వరలోనే ఈ ఇంటర్నేషనల్ విమానాశ్రయం పనులు చేపడతామని అన్నారు. ఈ ఎయిర్‌పోర్ట్ పనులను దశలవారీగా చేపట్టనున్నారు. తొలి విడతలో 1.4 లక్షల మంది ప్రయాణికులకు వార్షిక సామర్థ్యంతో తీర్చిదిద్దనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అనంతరం 15 మిలియన్ల వరకు పెంచేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ఇక ..మిగతా 2లో




## శ్రీ మోదకొండమ్మ అమ్మ వారితోనే ఆటలా!



### అధికారం ఉంది కదాని ఇష్టానుసారంగా ఉత్సవ మార్పులా

### మంత్రి గుమ్మడి మాటలపై భగ్గుమంటున్న గిరిజనం

### కిడారి పెళ్లి కోసం జాతర మార్పులా

### అమ్మవారు క్షమించరంటూ భక్తుల శాపనార్థాలు

### నేడు జిల్లా కలెక్టరేట్‌లో అత్యవసర సమావేశం

(ఎం. కే. సునీల్ కుమార్ - జయ జయహే బ్యూరో)

ఓ వైపు భద్రతా కారణాలు...మరో వైపు సాంప్రదాయ గిరిజన విశ్వాసాలు...ఈ రెండింటి మధ్య అల్లూరి జిల్లా పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మ వారి ఉత్సవ జాతర ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. అధికార యంత్రాంగం...కూటమి ప్రజా ప్రతినిధులంతా ఉత్సవాలను వాయిదా వేద్దామంటుంటే భక్తి పారవశ్యంతో మునిగిపోయిన గిరిజనం మాత్రం అందుకు ససేమిరా అంటున్నారు. ఏటా మే నెల రెండో వారంలో ..మిగతా 3లో

## నిజరూపం.. అపురూపం

### కన్నుల పండుగగా చందనోత్సవం

### స్వామివారిని దర్శించుకున్న లక్షలాది భక్తులు

### తొలి దర్శనం చేసుకున్న ధర్మకర్త అశోక్ గజపతి

### ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి అనిత



2

## వెంకట్రామి రెడ్డి డిస్మిస్

### రాజకీయ కార్యకలాపాలపై కన్నెర్ర

### కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం

(అమరావతి - జయజయహే)

ప్రభుత్వ సర్వీస్ నిబంధనలను ఉల్లంఘిస్తూ, ఉద్యోగి హోదాలో రాజకీయ కార్యకలాపాలకు పాల్పడిన సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డిపై ప్రభుత్వం వేటు వేసింది. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ సంఘం నేతగా ఉంటూనే వైసీపీకి అనధికార ప్రతినిధిగా వ్యవహరించారనే ..మిగతా 2లో



## భూమి పేరు మార్చడానికి లంచం

### రూ. 1.50 లక్షలు డిమాండ్ చేసిన వీఆర్వో

### రెడ్ హ్యాండెడ్ పట్టుకున్న ఏసీబీ

2

# నిజరూపం.. అపురూపం

**కన్నుల పండుగగా చందనోత్సవం**

**స్వామివారిని దర్శించుకున్న లక్షలాది భక్తులు**

**తొలి దర్శనం చేసుకున్న ధర్మకర్త అశోక్ గజపతి**

**ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి అనిత**

(విశాఖపట్నం - జయజయహే)



విశాఖ సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవం కన్నులపండువగా సాగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో సింహగిరి నృసింహ నామస్మరణతో మార్మోగింది. చందనోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సింహాద్రి అప్పన్నస్వామి చందనోత్సవం ఘనంగా జరిగింది. చందనోత్సవాన్ని పురస్కరించుకుని అప్పన్నస్వామి ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలను అలంకరించారు. మొదట ఆలయ పారంపర్య వంశ ధర్మకర్త, గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి తొలి చందనం సమర్పించి దర్శనం చేసుకున్నారు. హోంమంత్రి అనిత ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించింది. తెల్లవారుజామున మూడున్నర నుంచి 5 గంటల వరకు ప్రముఖులు అంతరాలయ దర్శనం చేసుకున్నారు. గత అనుభవాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు: ఉదయం 5 గంటల తరువాత సాధారణ భక్తులకు దర్శనం చేసుకునే అవకాశం కల్పించారు. ఏడాదికి ఒక్కసారి వచ్చే స్వామివారి నిజరూప దర్శన భాగ్యం కోసం భక్తులు భారీగా తరలిరావడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. సాయంత్రం 2.30 గంటల సమయానికే దాదాపు 70,000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రూ.1500, రూ.1000, రూ.300 ప్రత్యేక దర్శనాలతో పాటు ధర్మ దర్శనం లైన్లలో భక్తులు క్రమశిక్షణతో దర్శనాలు చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానంలోని అన్ని విభాగాలు సమన్వయంతో పని చేశాయి. పబ్లిక్ అడ్రస్



సిస్టమ్ ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అలానే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. దాదాపు 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండ ఎగువన, దిగువన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. లడ్డూ ప్రసాదం విక్రయాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఎండ వేడిని తట్టుకునేందుకు మంచినీరు, మజ్జిగ, బిస్కెట్లు, పిల్లలకు పాలు అందించారు. కూటమి ప్రభుత్వం, ఆలయ అధికారులు చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లపై భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.



# బాప్ రే.. యమ క్రేజ్

మొదటి పేజీ తరువాయి...

బెంగాలీ స్ట్రీట్ ఫుడ్‌ను ఝల్‌మురి తింటూ ఆస్వాదించారు.. మోదీ చేసిన స్ట్రీట్‌ఫుడ్ షాపింగ్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అయ్యింది. ఆదివారం పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా నాలుగు ర్యాలీలలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ క్రమంలో ఝార్‌గ్రామ్‌లో రుచికరమైన ఝల్‌మురిని తింటూ ప్రధాని మోదీ ఆస్వాదించారు. ఝల్‌మురి అనేది బెంగాల్ ప్రాంతానికి చెందిన అత్యంత ప్రజాదరణ పొందిన స్పైసీ స్నాక్. మురమరాలు, మసాలా, ఉప్పు కారం, తరిగిన ఉల్లిపాయ, టమాటా, పచ్చిమిర్చి ముక్కలు వేసి దీన్ని తయారు చేస్తారు. స్థానికులతో కలిసి ఝల్‌మురిని ఆస్వాదించారు మోదీ.ఝార్‌గ్రామ్‌లో భారీ బహిరంగ సభనుద్దేశించి ప్రసంగించిన తర్వాత హెలిప్యాడ్‌కు వెళ్లే దారిలో ఆగి ఈ బెంగాలీ స్ట్రీట్ ఫుడ్‌ను కొనుగోలు చేసి.. తిన్నారు. అంతేకాకుండా.. అక్కడున్నవారికి కూడా పంచారు. దుకాణదారుడు 'మీరు ఉల్లిపాయలు తింటారా?' అని అడగ్గా.. 'హా తింటాను, బుర్ర మాత్రం తినను' అంటూ మోదీ నవ్వులు పూయించారు. అనంతరం అక్కడే ఉన్న మహిళలు, పిల్లలు, పార్టీ కార్యకర్తలతో ఆయన సరదాగా సంభాషించారు. 'ఝార్గ్రామ్‌లో ఝాల్‌మురీ బ్రేక్' అంటూ సంబంధిత ఫొటోలు, వీడియోలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారాయి.

# వెంకట్రామి రెడ్డి డిస్మిస్

మొదటి పేజీ తరువాయి...

ఆరోపణలు ఎదుర్కొన్న ఆయనను, సర్వీస్ నుండి శాశ్వతంగా డిస్మిస్ చేస్తూ కూటమి ప్రభుత్వం సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయాలకు, ప్రభుత్వ సర్వీసులకు మధ్య ఉండాల్సిన లక్ష్మణ రేఖను ఆయన పూర్తిగా తుడిచివేసినట్లు విచారణలో తేలింది. వెంకట్రామిరెడ్డిపై ప్రధానంగా 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో నిబంధనలను అతిక్రమించారనే ఫిర్యాదులు ఉన్నాయి. కడప జిల్లా బద్వేలులో ఆర్టీసీ ఉద్యోగులతో రహస్య సమావేశం నిర్వహించి, వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని ఆయన ఓట్లు అభ్యర్థించారు. దీనిపై అప్పటి ప్రతిపక్షం టీడీపీ ఆధారాలతో సహా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో, ప్రాథమిక విచారణ అనంతరం ఆయనను పంచాయతీరాజ్ శాఖలో అసిస్టెంట్ సెక్రటరీ పదవి నుండి సస్పెండ్ చేశారు. అయితే, ఈ సస్పెన్షన్ కాలంలోనూ ఆయన తన పద్ధతి మార్చుకోలేదని తేలింది. సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగి తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలనే నిబంధనను పక్కనపెట్టి, వెంకట్రామిరెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నారని తాజా విచారణలో వెల్లడైంది. ఇతర ఉద్యోగులను సమీకరించి ప్రస్తుత ప్రభుత్వ విధానాలకు అడ్డుతగిలేలా ప్రలోభపెట్టడం, రహస్య రాజకీయ మంతనాలు జరపడం వంటి అభియోగాలు రుజువయ్యాయి. ఐదేళ్ల కాలంలో ఉద్యోగుల ప్రయోజనాలను గాలికొదిలేసి, కేవలం అధికార పార్టీ అజెండాను అమలు చేయడమే లక్ష్యంగా ఆయన పనిచేశారనేది విచారణాధికారులు నిర్ధారించినట్లుగా తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగుల కోసం మద్యం విందులు ఏర్పాటు చేసి, వారిని రాజకీయంగా ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు కూడా ఆయనపై నిర్ధారణ అయ్యాయి. ఉద్యోగ సంఘం ఎన్నిక సందర్భంగా ఆయన మద్యం విందుతో పార్టీ ఇస్తూ దొరికిపోయారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజ్యాంగబద్ధమైన తటస్థతను పాటించకుండా, ఒక రాజకీయ పార్టీ కార్యకర్తలా వ్యవహరించడం సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్ ప్రకారం తీవ్రమైన నేరమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ఆయనను విధుల్లోకి తీసుకునే అవకాశం లేకుండా బర్తరఫ్ చేస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ముసుగులో రాజకీయాలు చేసే వారికి ఈ బర్తరఫ్ వేటు ఒక గట్టి హెచ్చరిక అని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అధికార దుర్వినియోగం, నిధుల మళ్లింపు , రాజకీయ ప్రచారం వంటి అంశాల్లో ఆయనపై ఉన్న ఇతర అభియోగాలపై కూడా లోతైన దర్యాప్తు కొనసాగే అవకాశం ఉంది. తన డిస్మిస్ పై వెంకట్రామిరెడ్డి న్యాయపోరాటం చేస్తారా.. వైసీపీలో చేరి పూర్తి స్థాయి రాజకీయ నేతగా మారుతారా అన్నది చూడాల్సి ఉంది

# శ్రీ మోదకొండమ్మ అమ్మ వారితోనే ఆటలా!

మొదటి పేజీ తరువాయి...

నిర్వహించే ఈ ఉత్సవాలలో ఇప్పుడు రాజకీయ జోక్యం ఎందుకంటూ గిరిజనం ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఒకే ఒక్క కుటుంబ వివాహ ఆనందం కోసం ఎన్నో ఏళ్లుగా లక్షలాది మంది గిరిజనుల్లో పెనవేసుకున్న విశ్వాస భక్తి సాంప్రదాయాలతో ఆటలాడుకుంటారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాంప్రదాయాలను భద్రత...నిర్వహణలతో ముడిపెట్టి ముందుగా ప్రకటించిన తేదీల్లో కాకుండా ఇష్టానుసారంగా మార్పులు చేస్తే అమ్మవారి అనుగ్రహం కాస్త ఆగ్రహంగా మారితే గిరిజనం తట్టుకోలేరన్న భావోద్వేగ వ్యాఖ్యలు గిరిజన గూడేల్లో మార్మోగుతున్నాయి. అమ్మవారి జాతర చేయడానికి గత ఫిబ్రవరి 13వ తేదీనే ఉత్సవ..ఉద్యోగ..వర్తక..ఆలయ...అన్ని పార్టీల...గ్రామ పెద్దల కమిటీలు కలసి సంయుక్తంగా నిర్ణయించిన తేదీలను కాదని...కొత్త తేదీలు సూచించడంతో గిరిజనం రగిలిపోతున్నారు. ఇప్పటికే ఉత్సవాల కోసం భారీ ఎత్తున అడ్వాన్సు చెల్లింపులు చేసేయడం...కళాకారులకు రానుపోను వాహనాలు బుక్ చేయడం...కలకత్తా నుంచి విద్యుద్దీపాల అలంకరణకు ముందస్తు చెల్లింపులు చేయడం...ఇలా అనేక ఏర్పాట్లు చేసేసుకోవడం తర్వాత అవన్నీ అర్ధాంతరంగా మార్చేయడమంటే అంత ఈజీనా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

తూర్పు కనుమల్లో దట్టమైన అరణ్య ప్రాంతమైన పాడేరు చెంత శ్రీ మోదకొండమ్మ అమ్మవారు గిరిజనుల ఆరాధ్య దైవంగా ఎంతో ప్రాచుర్యం పొందారు. పూర్వ కాలంలో పాడేరు పరిసర ప్రాంతాన్నీ అడవులతో నిండివుండేవి. అక్కడ నివసించే గిరిజనులను కాపాడడానికి దుష్టశక్తులను సంహరించేందుకు అమ్మవారు మోదకొండమ్మ రూపంలో అవతరించారన్నది అక్కడి ప్రజల విశ్వాసం. మోదకొండ అనే కొండపై ఆమె ప్రత్యక్షమైందని ఆ కారణంగానే ఆ అమ్మవారిని మోదకొండమ్మగా పిలుచుకుంటారు. కాలక్రమేణా గిరిజనులంతా గ్రామ దేవతగా ఆరాధిస్తూ జాతరలు నిర్వహించడంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు సమీప ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన గిరిజనం కూడా అమ్మవారికి పాత్రులయ్యారు. దీంతో ఈ ఆలయాన్ని పూజా స్థలంగానే కాకుండా గిరిజనుల సాంప్రదాయాలు...ఆచార వ్యవహారాలు...జీవన శైలికి కేంద్ర బిందువుగా ఇక్కడి గిరిజన సంస్కృతి ఉంటుంది. భక్తితో అమ్మవారిని ప్రార్ధిస్తే కోరిన కోర్కెలు తీర్చడమే కాకుండా కష్ట కాలంలో ఆ దేవత రక్షణగా ఉంటుందని బలంగా నమ్ముతారు. అందుకే ఇప్పుడు అమ్మవారి సాంప్రదాయాలను మార్పు చేస్తే ఆమె ఆగ్రహం ఏ రూపంలో ఉంటుందో తట్టుకోలేమని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. శక్తి స్వరూపిణిగా...గ్రామ రక్షకురాలిగా...న్యాయ దేవతగా ఆధ్యాత్మిక భావనలు కలిగిన మోదకొండమ్మ అమ్మవారి జాతర కేవలం ఉత్సవంగానే కాకుండా ఆత్మీయ అనుభవంగా భావిస్తారు. అంతటి భక్తి ప్రాధాన్యత కలిగిన గిరిజనుల్లో ఇప్పుడు ఉత్సవ తేదీల్లో మార్పు పెద్ద అలజడిని రేపింది. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఉత్సవ తేదీల్లో మార్పు చేయాలని బహిరంగంగానే ప్రకటించారు. అప్పుడే స్థానిక గిరిజనం ఎదురు తిరిగారు. శాపనార్థాలు పెట్టారు. అమ్మవారితో పెట్టుకుంటే మాడి మసైపోతావ్ అంటూ గట్టిగానే వార్నింగ్ ఇచ్చారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ వివాహ వేడుక కోసం గిరిజనుల ఆరాధ్య దైవ ఉత్సవాలనే ఫణంగా పెడతారా అంటూ గిరిజనం ఆందోళన అగ్గి రాజేస్తోంది. ఒక్క కుటుంబ వేడుక కోసం సుధీర్ఘ చరిత్ర కలిగిన అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లపై నీళ్లు చల్లడం సరికాదని వేద పండితులు సైతం చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఉత్సవ కమిటీ ప్రకటించిన మే నెల 10, 11, 12 తేదీలు కాకుండా...మంత్రి ప్రకటించిన 17, 18, 19 తేదీల్లో కాకుండా ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై అధికార యంత్రాంగం క్లారిటీ చెప్పలేకపోతోంది. అయితే మంగళవారం పాడేరు కలెక్టరేట్‌లో ఉత్సవ కమిటీతో జిల్లా యంత్రంగం సమావేశం నిర్వహిస్తోంది. ఈ సమావేశంలో జిల్లా అధికార యంత్రాంగం అమ్మవారికి జై కొడతారో...కూటమి ప్రభుత్వానికి సై అంటారో చూడాలని గిరిజనులంటున్నారు.

# భూమి పేరు మార్చడానికి లంచం

(అనకాపల్లి - జయజయహే)

అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో భూమి రికార్డుల సవరణ కోసం లంచం డిమాండ్ చేసిన వీఆర్వో పోతల శంకర్‌రావు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఒక రైతు తన భూమి రికార్డుల్లో పేరు మార్పు చేసి, ఎల్పీఎం జారీ చేయించుకోవడానికి వీఆర్వోను సంప్రదించారు. ఈ పని చేయడానికి వీఆర్వో శంకర్‌రావు రూ.1.50 లక్షల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బాధితుడి నుంచి వీఆర్వో నగదు తీసుకుంటుండగా అధికారులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. వీఆర్వో శంకర్‌రావుపై గతంలో కూడా అవినీతి మరకలు ఉన్నట్లు ఏసీబీ అధికారుల విచారణలో తేలింది. గతంలోనూ వీఆర్వోపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకుందని అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ శంకర్‌రావు తీరు మారలేదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ హర్షిణి ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా పని కోసం లంచం డిమాండ్ చేస్తే వెంటనే 1064 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి అవినీతిపై ఫిర్యాదు చేస్తేనే వ్యవస్థలో మార్పు వస్తుందని, బాధితులు నేరుగా ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. లంచం తీసుకోవడం, ఇవ్వడం రెండూ నేరమేనని, అవినీతికి పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. భూమి సమస్యలతో సతమతమవుతున్న సామాన్య రైతులను పీడించే ఇలాంటి అధికారులపై ఏసీబీ దాడులు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# అమ్మో.. నిమ్మ..!

**అకస్మాతుగా పెరిగిన ధర**

**ఇటీవల కిలో రూ. 30 మాత్రమే**

**సమ్మర్ సీజన్ లో రూ. 300కి పెంపు**

(విజయవాడ - జయజయహే)

తెలుగు రాష్ట్రాల్లో భానుడు సెగలు గక్కుతున్నాడు. ఎండ తీవ్రతకు జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో 40 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం, వేడి ఉక్కపోతతో జనం విలవిలలాడుతున్నారు.. ఈ క్రమంలో.. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని పానీయాలను ఆశ్రయిస్తున్నారు. సాధారణంగా పండ్ల రసాలతో పోలిస్తే.. నిమ్మరసం కొంచెం తక్కువ ధరకు లభిస్తుంది. కానీ.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు నిమ్మరసాన్ని ఆశ్రయిద్దామనుకుంటే.. అక్కడ ధరలు చూసి సామాన్యుడికి గుండె గుభేల్ అంటోంది. గత కొద్ది రోజుల క్రితం వరకు పాతాళంలో ఉన్న నిమ్మకాయ ధరలు.. ఒకేసారి ఆకాశాన్ని తాకుతున్నాయి. కిలో నిమ్మకాయల ధర ఏకంగా 300 రూపాయలకు చేరడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. చాలా జిల్లాల్లో కేజీ నిమ్మకాయ ధరలు 250 నుంచి 300 లకు పైగా పలుకుతున్నాయి. ఎండలు మండుతున్నాయి.. గొంతు ఎండుతోంది.. కానీ దప్పిక తీర్చుకుందామంటే నిమ్మకాయ ధరలు భయపెడుతున్నాయని సాధారణ ప్రజానీకం పేర్కొంటున్నారు. అటు ఎండల తీవ్రత పెరగడం, ఇటు శుభకార్యాల సీజన్ కావడంతో నిమ్మకాయలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఫలితంగా మార్కెట్‌లో నిమ్మ ధరలకు రెక్కలొచ్చాయి..నిన్న మొన్నటి వరకు కిలో 30 రూపాయలు కూడా పలకని నిమ్మకాయ.. నేడు ఏకంగా 300 రూపాయల మార్కును తాకింది.. చిన్నపాటి నిమ్మకాయను కూడా ఒక్కొక్కటి 10 రూపాయలకు విక్రయిస్తుండటం గమనార్హం.. గతంలో కిలో లెక్కన కొనే సామాన్యుడు. ఇప్పుడు లెక్కపెట్టి కాయలను కొనే పరిస్థితి వచ్చింది. గత నెలలో ధరలు దక్కక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండగా.. ఇప్పుడు డిమాండ్ పెరిగినా సామాన్యుడికి మాత్రం అది భారంగా మారింది. ఇక శుభకార్యాల సీజన్ కావడంతో నిమ్మకాయల వినియోగం అనివార్యమైంది. అయితే.. పెరిగిన ధరల వల్ల ఫంక్షన్లు చేసేవారు కూడా నిమ్మకాయల వాడకాన్ని తగ్గించుకుంటున్నారు. హోటళ్లు, జ్యూస్ సెంటర్ల యజమానులు సైతం ధరల పెరుగుదలతో కస్టమర్ల నుంచి అధిక ధరలు వసూలు చేయక తప్పడం లేదని వాపోతున్నారు. మొత్తానికి నిమ్మకాయ సామాన్యుడికి అందనంత దూరంలోకి వెళ్ళిపోయింది. ఎండల తీవ్రత ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో.. నిమ్మ ధరలు మరిన్ని రికార్డులు సృష్టిస్తాయో లేక అదుపులోకి వస్తాయో వేచి చూడాలి.

# వీఆర్ నిరీక్షణ సరికాదు

**ఈ చర్య పోలీస్ అధికారులకు శిక్షలా మారింది**

**ప్రభుత్వం పునరాలోచన చేసి పోస్టింగ్ ఇవ్వాలి**

**మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండ్**

అమరావతి,జయ జయహే

రాష్ట్రంలో పోలీస్ అధికారులపై అమలు అవుతున్న వేకెన్సీ రిజర్వ్ విధానం పట్ల మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన,కూటమి ప్రభుత్వం 199 మంది పోలీస్ అధికారులను సస్పెండ్ చేయకుండా, ఎటువంటి శిక్షా చర్యలు చేపట్టకుండా కేవలం వీఆర్‌లో ఉంచి వేచి ఉండేలా చేయడం వారిని మానసిక వేదనకు గురి చేయడమేనని విమర్శించారు.గత రెండేళ్లుగా కొనసాగుతున్న ఈ 'తాత్కాలిక' జాబితా అధికారుల పాలిట శాపంగా మారిందని,శిక్ష విధించకుండానే నిరీక్షణను శిక్షగా మార్చడం సరికాదని ఆయన పేర్కొన్నారు.వీఆర్‌లో ఉన్న అధికారులలో నలుగురు ఐపీఎస్ అధికారులు,నలుగురు రాష్ట్ర కేడర్ ఎస్పీలు,ఒక ఏపీఎస్పీ కమాండెంట్,27 మంది అదనపు ఎస్పీలు, 42 మంది డీఎస్పీలు మరియు 119 మంది ఇన్‌స్పెక్టర్లు ఉన్నారని ఆయన వెల్లడించారు.వీరిలో కొంతమందికి కనీసం జీతాలు,అలవెన్సులు కూడా అందడం లేదని ఆరోపించిన విజయసాయిరెడ్డి,ఈ విధానం వల్ల పోలీస్ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుత కూటమి సర్కార్ మరియు గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వశీ,రెండూ ఇలాంటి చర్యలకు పాల్పడటం ఒక విష వలయంలా మారిందని అక్షేపించారు.దీనిని వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సుదీర్ఘ నిరీక్షణ అధికారుల వృత్తిగత జీవితంపై చూపే ప్రభావం దృష్ట్యా,ప్రభుత్వం ఈ అంశంపై స్పందించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణం వారికి పోస్టింగులు ఇచ్చి, వారి కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకునేలా ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆయన కోరారు.

# దగదర్తిలో ఎయిర్ పోర్టు

మొదటి పేజీ తరువాయి...

ఫ్యూచర్‌లో కార్గో ఫెసిలిటీ కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే ఇప్పటికే ఈ ఎయిర్‌పోర్ట్ కోసం భూసేకరణ, విద్యుత్, నీరు, టెలిఫోన్ కనెక్టివిటీ కోసం ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో 54 కోట్లు విడుదల చేసింది. ఈ క్రమంలో వీలైనంత త్వరగా పనులు చేపట్టేందుకు అధికారులు రెడీ అవుతున్నారు .జూన్ లేదా జులైలో దగదర్తి ఎయిర్‌పోర్ట్ పనులకు శంకుస్థాపన చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్లా ప్రకటించారు. ఇక జులైలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పనులు దాదాపుగా పూర్తి అవ్వగా.. కొన్ని పెండింగ్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తి కాగా.. ఇందులో భాగంగా ఢిల్లీ నుంచి విమానం భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వచ్చింది. దీంతో ట్రయల్ రన్ సక్సెస్ అయిందని ఎయిర్ పోర్ట్ అధికారులు తెలిపారు. ఇక భోగాపురంతో పాటు దగదర్తి విమానాశ్రయం పూర్తి అయితే రాష్ట్రంలో 8వ ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వచ్చినట్లు అవుతుంది. కాగా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌కు కనెక్టివిటీ కోసం విశాఖ నుంచి ప్రత్యేక రోడ్లు నిర్మించారు. అలాగే చుట్టపక్కల ప్రాంతాల నుంచి కూడా కనెక్టివిటీ కోసం కొత్త రోడ్లు నిర్మించారు. దీని వల్ల ఎయిర్‌పోర్ట్‌కు ప్రయాణికులు త్వరగా చేరుకోవచ్చు.

# ఎన్డీఏ సీఎం ప్రమాణస్వీకారానికి వస్తా





**మొదటి పేజీ తరువాయి...**

మొదటగా చేరుకున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు వీగిపోయేలా చేయడంపై విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాల వాదనలో అసలు వాస్తవం ఏముంది.. ఏదైనా ఒక వాదన చేసేటప్పుడు అందులో లాజిక్ ఉండాలన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా సీట్లు 50 శాతం పెరిగితే దక్షిణాదికి మేలు జరుగుతుందన్నారు. . దీనివల్ల అందరికీ సమానమైన ప్రయోజనం చేకూరుతుంది, అలాగే మహిళలకు కూడా రిజర్వేషన్లు దక్కుతాయి అని స్పష్టం చేశారు . కాంగ్రెస్ కు వ్యతిరేకంగా డీఎంకే ఏర్పాటు అయిందని ఇప్పుడు ఆ డీఎంకే.. కాంగ్రెస్ తో పొత్తులు పెట్టుకుంటోందని విమర్శలు గుప్పించారు. గతంలో జయలలిత పోటీ చేసిన సమయంలో ఎన్డీఏ తరపున ప్రచారానికి వచ్చారని... ఇప్పుడు మళ్లీ వచ్చానన్నారు. ఖచ్చితంగా ఎన్డీఏ సీఎం ప్రమాణ స్వీకారానికి వస్తానన్నారు. అదే సమయంలో విజయ్ పార్టీపై వ్యాఖ్యానించేందుకు చంద్రబాబు నిరాకరించారు. ఎన్నికల్లోనే చూస్తారని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. దేశాభివృద్ధి, రాష్ట్రాల ప్రగతి పరస్పరం ముడిపడి ఉన్నాయని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తమిళనాడులో సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై శక్తివంతంగా ఎదుగుతోందని, అదే వేగాన్ని తమిళనాడు కూడా అందుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తమిళనాడుతో తనకు ఉన్న దశాబ్దాల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఇక్కడి ప్రజల అభివృద్ధి పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఎన్డీయే కూటమి కేవలం రాజకీయ పొత్తు కాదని, అది దేశాభివృద్ధికి ఒక గ్యారంటీ అని ఆయన అభివర్ణించారు. శాంతిభద్రతల పరిరక్షణ, పెట్టుబడుల ఆకర్షణ మరియు యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ఎన్డీయే సర్కార్ విప్లవాత్మక మార్పులు తెస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చెన్నైలోని ఆవడిలో భారీ రోడ్ షో నిర్వహించనున్న చంద్రబాబు, మంగళవారం మదురై , సత్తూరు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. అక్కడ సామాజిక వర్గాల నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరగనుంది.



## ప్రత్తిపాడులో త్వరలో అడిషనల్ కోర్టు పనులు ప్రారంభం

### జిల్లా జడ్జి గంధం సునీత

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

ప్రత్తిపాడు న్యాయవాదుల చిరకాల కోరిక నెరవేరుతోందని, అక్కడ కొత్తగా మంజూరైన అడిషనల్ కోర్టు పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టులో ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ నూతన ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, ప్రత్తిపాడు కోర్టు అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన సానుకూల ఉత్తర్వులను వివరించారు. బార్ అసోసియేషన్ సొంత భవన నిర్మాణానికి అవసరమైన స్థలం మంజూరైందని, దీనివల్ల న్యాయవాదులకు శాశ్వత వసతి లభిస్తుందని తెలిపారు. కోర్టు సముదాయంలో క్యాంటీన్ నిర్వహణకు, అలాగే జెరాక్స్ యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవడానికి తక్షణ అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అడిషనల్ కోర్టు ప్రారంభానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తికి నూతన కార్యవర్గం తరపున అధ్యక్షులు రాజాల చిట్టిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్తిపాడు కోర్టును జిల్లాలోనే ఆదర్శవంతమైన కోర్టుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా న్యాయవాదులు ప్రతిజ్ఞ చేశారు. ఈ మర్యాదపూర్వక భేటీలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆడారి సుగుణ (వైస్ ప్రెసిడెంట్), బొంగుళూరి మధుబాబు (జనరల్ సెక్రటరీ), గెడ్డం కామేశ్వరరావు (జాయింట్ సెక్రటరీ), అవసరాల దేవి (ట్రెజరర్) పాల్గొన్నారు. వీరితో పాటు మంచికంటి శ్రీనివాస భారతి, లింగంపల్లి శివ కుమార్, కలవపల్లి సుజన మరియు సీనియర్ సభ్యులు కూచిమంచి సూర్య ప్రకాశరావు, రాయి అచ్యుత రామారావు, బత్తుల రవికుమార్ తదితరులు పాల్గొని న్యాయమూర్తికి ధన్యవాదాలు తెలియజేశారు.



## స్వర్ణాంధ్ర స్వాప్నికుడు చంద్రబాబు: గంటా


**మధురవాడ, ఏప్రిల్ 20: (జయ జయహే)**

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా అభివృద్ధి చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్న స్వర్ణాంధ్ర స్వాప్నికుడు చంద్రబాబు నాయుడని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబు పుట్టిన రోజును పురస్కరించుకుని మారికవలసలో సోమవారం కేక్ కట్ చేశారు. అలాగే అన్న క్యాంటీన్ లో భోజనాన్ని రుచి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన అత్యంత సీనియర్ నాయకుడిగా పేర్కొన్నారు. 2024 లో అధికారం చేపట్టే నాటికి రూ. 10 లక్షల కోట్ల అప్పుతో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధిలోనూ.. సంక్షేమ పథకాల అమలులోనూ.. దేశంలోనే ముందు వరసలో నిలబెట్టారని ప్రశంసించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చిక్కాల విజయ్ బాబు, మొల్లి లక్ష్మణరావు, నాగోతి వెంకట సత్యనారాయణ, మన్యాల సోంబాబు, అక్కరమాని వెంకట్రావు, మొల్లి హేమలత, వాండ్రాసి అప్పలరాజు, చెట్టుపల్లి సన్యాసిరావు, ఈగల రవికుమార్, బోయి రమణ, గరే గుర్నాథ్, పోలిశెట్టి నాగేశ్వరరావు, కానూరు అచ్యుతరావు, శ్రీరామ్మూర్తి, మామిడి దుర్గారావు, నాగోతి సూర్య ప్రకాష్, నాగోతి శివాజీ, చెట్టుపల్లి గోపి, పిల్లా రాము, పీవీ నరసింహం, పిల్లా మోహన్ కృష్ణ, పంచదార్ల శ్రీనివాస్, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.



# అన్నా క్యాంటీన్‌లో చంద్రబాబు బర్త్ డే





**మొదటి పేజీ తరువాయి...**

లబ్ధిదారులు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు దంపతులు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అల్పాహారాన్ని వడ్డించారు. అనంతరం సీఎం చంద్రబాబు రూ.10 ఇచ్చి రెండు టోకెన్లు తీసుకోబోగా, నేడు అన్నక్యాంటీన్లలో ఉచితంగా ఆహారం అని టోకెన్ నిర్వహకుడు తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి అల్పాహారాన్ని తీసుకున్నారు సీఎం చంద్రబాబు దంపతులు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో నేడు ఉచితంగా అన్న వితరణ చేస్తున్నారు. అన్న క్యాంటీన్లో బ్రేక్ ఫాస్ట్ తరువాత సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. ‘అన్న క్యాంటీన్లో కేవలం రూ.5కే గౌరవప్రదంగా నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ప్రారంభించాం. పేదలకు ఉదయం, మధ్యాహ్నం ,రాత్రి అన్న క్యాంటీన్లో తక్కువ ధరకు ఫుడ్ లభిస్తుంది. బయట భోజనం చేయాలంటే రూ.100 చెల్లించాలి. వీటిని దృష్టిలో ఉంచుకుని అన్న క్యాంటీన్లో ఐదు రూపాయలకే కడుపు నింపుతున్నాం. ఇస్కాన్ ఫౌండేషన్ వారు సెంట్రల్ కిచెన్ ద్వారా రుచికరమైన, నాణ్యమైన ఫుడ్ అందిస్తున్నారు. రాష్ట్రంలో 269 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయి. మరో 5 త్వరలో ప్రారంభించనున్నాం. నా పుట్టినరోజు సందర్భంగా రూ.76 లక్షలను సతీమణి నారా భువనేశ్వరి విరాళం ఇచ్చారు. ఈరోజు మూడు పూటలా అన్న క్యాంటీన్లలో ఉచితంగా భోజనం లభిస్తుంది. అన్నదానం చేస్తే ఎంతో పుణ్యం. మీకు వీలైతే ఒక్కపూట, ఒక్కరోజు.. మీకు ప్రత్యేకమైన రోజున అన్నదానం చేసి పేదవారి ఆకలి తీర్చే మహత్తర కార్యక్రమం ఇది. పీ4 కార్యక్రమం ద్వారా సమాజానికి ఎంతో మేలు చేయవచ్చు. పైన ఉండే 10 శాతం వర్గాలు అట్టడుగున ఉండే 20 శాతం వారికి ఏదో రూపంలో సాయం చేసి ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు ముందుకు రావాలి.



## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని జనసేన నాయకులు ప్రత్యేక పూజలు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల్లోకి రావాలని ఆకాంక్షిస్తూ నిడదవోలు పట్టణంలోని శ్రీ గోలింగేశ్వర స్వామి ఆలయంలో జనసేన పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజారుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, పవన్ కళ్యాణ్ దీర్ఘాయుష్షు మరియు ఆరోగ్య క్షేమం కోసం ప్రార్థనలు చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ ప్రజల కోసం నిరంతరం కృషి చేసే నాయకుడని, ఆయన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని అందరూ కోరుకుంటున్నారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు మద్దతుగా ఎల్లప్పుడూ ఉంటారని పేర్కొన్నారు. శేషగిరి హాస్పిటల్స్ అధినేత మరియు జనసేన నాయకుడు తోపరాల కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని దేవుని ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు. ఈ తరహా పూజలు నిర్వహించడం ద్వారా భక్తి, ఐక్యతను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. గోలింగేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బచ్చు లక్ష్మణరావు (నాని) మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత శక్తివంతంగా పాల్గొనాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ఆలయ ట్రస్ట్ బోర్డు ధర్మకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



## 5జీ మొబైల్ ఫోన్ల పంపిణి చేసిన జిల్లా కలెక్టర్ నిషాంతి

**ఏఎస్ఆర్ జిల్లా పాడేరు 20 ఏప్రిల్, (జయ జయహే )**

జిల్లాలో 11 మండలాలకు సంబంధించిన 583 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ లకు సాంసంగ్ 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ కెపాసిటీ గల 5జీ మొబైల్ ఫోన్ల పంపిణీ చేసిన కలెక్టర్ నిషాంతి. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవల వినియోగాన్ని మరింత వేగవంతం చేసేందుకు గాను స్వయం సహాయక సంఘాల పర్యవేక్షణను సులభతరం చేసేందుకు ప్రభుత్వం వినూత్న చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 11 మండలాల్లో విధులను నిర్వహిస్తున్న 583 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు అత్యాధునిక 5జీ మొబైల్ ఫోన్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సాధికారత గణాంకాలను వెల్లడించుటకు ప్రభుత్వం రూ. 18 వేల ,499 వందల రూపాయలతో కొనుగోలు చేసిన మొబైల్ ఫోన్స్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాలు జిల్లా వ్యాప్తంగా 13,316 గ్రూపులు క్రియాశీలకంగా ఉన్నారాని, జిల్లా సంఘాల్లో మొత్తం 1,52,554 మంది మహిళ సభ్యులుగా ఉండగా, ఆ సభ్యులకు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా వి వోఏ లు సాంకేతికతను పుణికిపుచ్చుకోవాలి. 5జీ ఫోన్ల ద్వారా గ్రూపుల డేటా ఎంట్రీ, ప్రభుత్వ పథకాల సమాచారం, రిపోర్టింగ్ ప్రక్రియ మరింత వేగంగా జరుగుతుందని అందుతో టైం సేవింగ్, చేసే పనిలో పారదర్శకంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యురాలు కావాలి గ్రీష్మ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పనులు విఓఏల ద్వారా జవాబుదారితనాన్ని పెంచి నారీ శక్తి యొక్క శక్తిని నిరూపించిన మన ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మొబైల్ ఫోన్ వల్ల ఎస్ హెచ్ జి గ్రూపుల వివరాలు, సేవింగ్స్, రుణాల చెల్లింపులు ఖచ్చి తత్వం పెరుగుతుందని, మీలో ఉన్నటువంటి రియల్ టైం డేటా ఎంట్రీ సులభతరం అవుతుందని తెలిపారు. పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి 76వ పుట్టినరోజు సందర్భంగా వివోఏ లకు మొబైల్ ఫోన్స్ పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని వారి పనితనానికి నిదర్శనమని, ఆర్ టి జి ఎస్ డేటా అప్లోడ్ చేయుటలో, ఎస్ హెచ్ జి గ్రూపుల వివరాలు పొందుపరుచుటకు ఈ మొబైల్ ఫోన్స్ ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ ఈ కార్యక్రమంలో జి సి సి డైరెక్టర్ బొర్ర నాగరాజు, డిఆర్డిఏ పిడి మురళి, డిపిఎం, భగవాన్ దాస్ , ఫైనాన్సు ఏపీఎం సత్య ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు,మండల సమాఖ్య ప్రతినిధులు వివోఏ లు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో



## 30 వరకు అజారుద్దీన్ మంత్రి పదవి

### ఈలోగా ఎమ్మెల్సీగా గవర్నర్ ఆమోదించాలి

### సిఎం వినతితో గవర్నర్ ఆమోదంస్తారా అన్న ఉత్కంఠ

గతేడాది అక్టోబర్ 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిబంధనల ప్రకారం చట్టసభల్లో సభ్యుడు కాకుండా మంత్రి పదవి చేపడితే కచ్చితంగా ఆరు నెలల్లో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్‌కు ఈ నెల 30తో ఆ గడువు ముగుస్తుంది. ఈలోగా ఆయన ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముందు హడావిడిగా ఆయనను కేబినేట్‌లోకి తీసుకున్నారు. ప్రస్తుతం గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిపై గత బీఆర్ఎస్ నుంచి వివాదాలు కొనసాగుతున్నాయి . కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను మంత్రివర్గం సిఫార్సు చేసింది. దీన్ని బీఆర్ఎస్ నేతలు న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఇద్దరి ఎమ్మెల్సీ పదవులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆ తర్వాత మంత్రివర్గం అమీర్ అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్ పేరును చేర్చి.. మళ్లీ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేసింది కానీ, విషయం న్యాయస్థానంలో ఉండటంతో వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయలేదు. తెలంగాణలో ఎమ్మెల్సీల ఎంపికకు తమ ఉత్తర్వులు అడ్డుకావని ఇటీవల సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో.. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ ఫైల్ క్లియరెన్స్ కోసం సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలిసినట్టు సమాచారం. వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించాలని కోరారు. ఈ వారం, పదిరోజుల్లో గవర్నర్ ఆమోదిస్తే అజారుద్దీన్ మంత్రిగా ఉంటారు. లేదంటే మళ్లీ మాజీ కాక తప్పదు. గవర్నర్ కోర్టులో ఇప్పుడు బాల్ ఉంది. ఇద్దరు ఎమ్మెల్సీల్లో కోదండరాం పేరును ఆమోదించేందుకు గవర్నర్ సానుకూలత వ్యక్తం చేసినట్టు తెలిసింది. అజారుద్దీన్ విషయంలో సందిగ్ధంలో ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఏసీబీ కేసు నమోదైందని, మూడు ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని గవర్నర్ కార్యాలయం గుర్తించినట్టు తెలిసింది. రూ.3.8కోట్ల ఆర్థిక అవకతవకల మీద ఈడీ విచారణ ఎదుర్కొని, ఇదే కేసులో ఆయనపై చార్జ్‌షీట్ ఉన్నదని గుర్తించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఫైల్‌ను న్యాయసమీక్షకు పంపినట్టు తెలిసింది. న్యాయనిపుణుల సలహా మేరకు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేసేందుకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా అభ్యంతరం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆర్థిక అవకతవకల కేసులో ఈడీ విచారణ ఎదుర్కొన్న నేపథ్యంలో ఆయన్ను నేరుగా ఎమ్మెల్సీగా ఆమోదించేందుకు అంగీకరించలేదని తెలిసింది. న్యాయనిపుణుల సలహా తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ తేల్చిచెప్పినట్టు తెలిసింది. అజారుద్దీన్‌కు మరో 10రోజులే డెడ్‌లైన్ ఉన్నది. ఆయన మంత్రిగా కొనసాగాలంటే ఈలోగా ఎమ్మెల్సీ కావాల్సిన అనివార్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం గవర్నర్‌తో భేటీ అయ్యారు. గవర్నర్ కోటాలో ముద్దసాని కోదండరాంరెడ్డి, మహ్మద్ అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఇప్పటికే గవర్నర్‌కు పంపింది. ఈ ఇద్దరు పేర్లను ఆమోదించాల్సిందిగా రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను అభ్యర్థించారు. గవర్నర్ తీసుకునే నిర్ణయంతో ఈ ఇద్దరి భవితవ్యం ఆధారపడి ఉంది..

## క్షయం లేని పుణ్యఫలం..

# అక్షయ తృతీయ విశిష్ట ఫలం

(సి.హెచ్.ప్రతాప్)

**భారతీయ కాలమానంలో వైశాఖ శుద్ధ తదియకు అత్యంత విశిష్టమైన స్థానం ఉంది, దీనినే మనం 'అక్షయ తృతీయ' అని పిలుచుకుంటాం. 'అక్షయ' అనే పదానికి క్షయం లేనిది లేదా ఎన్నటికీ తరిగిపోనిది అని అర్థం. ఈ పవిత్ర దినాన చేసే ఏ చిన్న సత్కార్యమైనా, దానధర్మాలైనా భక్తులకు అనంతమైన ఫలితాలను ప్రసాదిస్తాయని పురాణాలు ఘోషిస్తున్నాయి. కేవలం బంగారం కొనడమే ఈ పండుగ పరమార్థం అని భావించే నేటి సమాజంలో, దీని వెనుక ఉన్న లోతైన ఆధ్యాత్మిక, చారిత్రక మరియు సామాజిక కోణాలను విశ్లేషించడం ఎంతో అవసరం.**




చారిత్రక ప్రాశస్త్యం పరంగా చూస్తే, కృతయుగం ముగిసి త్రేతాయుగం ప్రారంభమైన మహోన్నత ఘడియలు ఇవే. జగత్తును రక్షించే విష్ణుమూర్తి ఆరవ అవతారమైన పరశురాముడు జన్మించిన పవిత్ర దినం కూడా ఇదే కావడం విశేషం. అంతేకాకుండా, వేద వ్యాస మహర్షి మహాభారత కావ్యాన్ని గణపతి సహాయంతో రాయడం ప్రారంభించిన రోజుగా దీనిని అభివర్ణిస్తారు. గంగానది స్వర్గం నుండి భూమికి దిగివచ్చిన క్షణాలు కూడా ఈ తిథి నాడే సంభవించాయని భక్తుల దృఢ విశ్వాసం. ఇలాంటి ఎన్నో దివ్యమైన సంఘటనలకు అక్షయ తృతీయ వేదికగా నిలిచింది.

ప్రస్తుత కాలంలో అక్షయ తృతీయ అంటే కేవలం స్వర్ణ సేకరణ అనే భావన బలంగా నాటుకుపోయింది. అయితే, శాస్త్రాల ప్రకారం ఈ రోజున 'దానం' చేయడం అత్యున్నతమైన కార్యంగా చెప్పబడింది. పాండవులు వనవాసంలో ఉన్నప్పుడు వారికి ఆకలి తీర్చడానికి సూర్యభగవానుడు 'అక్షయ పాత్ర'ను ప్రసాదించినది ఈ రోజే. ఆ పాత్ర ఏ విధంగానైతే అన్నం తరిగిపోకుండా చూస్తుందో, అలాగే ఈ రోజున చేసే దానధర్మాలు దాతకు అక్షయమైన పుణ్యాన్ని ప్రసాదిస్తాయి. ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే వైశాఖ మాసంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, గొడుగులు, విసనకర్రలు, నీటి పాత్రలు మరియు చెప్పులు దానం చేయడం విశేష ఫలప్రదమని నమ్ముతారు.

ఆధ్యాత్మికంగా చూస్తే, ఈ రోజు లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాలలో విశేష పూజలు జరుగుతాయి. సింహాచల క్షేత్రంలో స్వామివారి నిజరూప దర్శనం కల్పించే 'చందనోత్సవం' ఈ తిథి నాడే జరగడం మరో విశేషం. వ్యాపారస్తులు తమ నూతన ఖాతా పుస్తకాలను ప్రారంభించడానికి, రైతులు విత్తనాలు చల్లడానికి ఈ రోజును అత్యంత శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజున చేసే స్నాన, జప, హోమ కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను, అక్షయమైన పుణ్యరాశిని అందిస్తాయి.



నిజమైన 'అక్షయ' అంటే కేవలం భౌతిక సంపద మాత్రమే కాదు, అక్షయమైన జ్ఞానం, అక్షయమైన భక్తి మరియు అక్షయమైన మానవత్వం. స్వార్థాన్ని వీడి పరోపకారం కోసం చేసే చిన్న ప్రయత్నం కూడా ఈ రోజున అద్భుతమైన మార్పులకు నాంది పలుకుతుంది. ప్రకృతి సిద్ధంగా మార్పులు సంభవించే ఈ కాలంలో, పర్యావరణాన్ని రక్షించే మొక్కలు నాటడం వంటి పనులు కూడా అక్షయ ఫలప్రదాలే. సంపద పెరగడమే కాదు, మనలోని సద్గుణాలు కూడా అక్షయం కావాలన్నదే ఈ పండుగ ఇచ్చే గొప్ప సందేశం. ఆడంబరాలకు పోకుండా భక్తితో, సేవాభావంతో గడిపే అక్షయ తృతీయే మానవాళికి నిజమైన శ్రేయస్సును చేకూరుస్తుంది. ధర్మబద్ధమైన సంపాదన, నిష్కామ కర్మలు మాత్రమే మనిషికి శాశ్వతమైన అక్షయ ఫలాన్ని అందిస్తాయి.

# దేశంలోనే అపూర్వం- జలధార పథకం

## (ఆంధ్రప్రదేశ్‌లో నీటి నిర్వహణకు నూతన దిశ)

(సి.హెచ్.ప్రతాప్)

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన "జలధార పథకం" నీటి వనరుల సమర్థ వినియోగం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరత నివారణ దిశగా ఒక వినూత్న ప్రయత్నంగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా నీటి సంక్షోభం పెరుగుతున్న నేపథ్యంలో ఈ పథకం ప్రాధాన్యం మరింత పెరిగింది. వ్యవసాయం, తాగునీరు, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని రూపొందించిన ఈ పథకం రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా మారే అవకాశం ఉంది.**



జలధార పథకం ప్రధాన లక్ష్యం వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించడం. దీనిలో భాగంగా చెక్‌డ్యాంలు, రీచార్జ్ పిట్‌లు, పర్కొలేషన్ ట్యాంకులు నిర్మించడం జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నీటి బిందువును సద్వినియోగం చేయాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. దీని ద్వారా భూగర్భ జలాల స్థాయి పెరిగి, భవిష్యత్తులో నీటి కొరత సమస్య తగ్గే అవకాశం ఉంది.

వ్యవసాయ రంగానికి ఈ పథకం ఎంతో మేలు చేస్తుంది. రైతులు సాగునీటి కోసం వర్షాలపై మాత్రమే ఆధారపడకుండా, భూగర్భ జలాల ద్వారా స్థిరమైన నీటి సరఫరాను పొందగలుగుతారు. ఇది పంటల ఉత్పాదకతను పెంచడమే కాకుండా రైతుల ఆదాయాన్ని కూడా మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా ఎండ ప్రాంతాల్లో ఈ పథకం ప్రభావం స్పష్టంగా కనిపించనుంది.




ఇంకా ఒక ముఖ్యమైన అంశం ప్రజల భాగస్వామ్యం. జలధార పథకంలో స్థానిక ప్రజలను, రైతులను చురుకుగా పాల్గొనేటట్లు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గ్రామ స్థాయిలో నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించడం, సహకారంతో పనులు నిర్వహించడం ఈ పథకానికి బలం. ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడు మాత్రమే ఇలాంటి పథకాలు దీర్ఘకాలిక ఫలితాలను అందిస్తాయి.

సాంకేతికతను కూడా ఈ పథకంలో వినియోగిస్తున్నారు. జియో మ్యాపింగ్, డేటా విశ్లేషణ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా నీటి వనరుల నిర్వహణను సమర్థవంతంగా చేపడుతున్నారు. దీనివల్ల ప్రణాళికలు ఖచ్చితంగా అమలు కావడంతో పాటు వనరుల వినియోగం మెరుగుపడుతుంది.

అయితే ఈ పథకం విజయవంతం కావాలంటే క్రమం తప్పని పర్యవేక్షణ అవసరం. నిర్మించిన సదుపాయాలు సక్రమంగా పనిచేస్తున్నాయా అనే విషయాన్ని నిరంతరం పరిశీలించాలి. అలాగే ప్రజల్లో నీటి సంరక్షణపై చైతన్యం కొనసాగించాలి.



## ఘనంగా సీఎం చంద్రబాబు

# జన్మదిన వేడుకలు

నిడదవోలు జయ జయహే ప్రతినిధి:

నిడదవోలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోని శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముఖ్యమంత్రికి దీర్ఘాయుష్షు కలగాలని ప్రార్థనలు చేశారు.అనంతరం నిడదవోలు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి సీఎం నారా చంద్రబాబు నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ శాసనసభ్యుడు, నిడదవోలు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.తదుపరి సేవా కార్యక్రమాల్లో భాగంగా నిడదవోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయగా, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గోదావరి మహా పుష్కరాలు-2027

## కందుల దుర్గేష్ సమక్షంలో రూ.13.12 కోట్ల పనులకు శ్రీకారం





**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి మహా పుష్కరాలు--2027ను పురస్కరించుకుని చేపట్టనున్న విస్తృత స్థాయి అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో మౌలిక వసతులను మెరుగుపర్చే దిశగా చర్యలు వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో కడియం, దివాన్ చెరువు, రంగంపేట, వెలుగుబంద తదితర ప్రాంతాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించి, శంకుస్థాపనలు నిర్వహించేందుకు సోమవారం రాజమహేంద్రవరం విచ్చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఇక గోదావరి ఘాట్ ప్రాంతంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రూ. 13.12 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను ప్రారంభించి శంకుస్థాపన చేశారు. ఆధునిక అండర్‌గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థ ద్వారా ఘాట్ ప్రాంతంలో నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ఒక ప్రైవేట్ అతిథి గృహంలో మంత్రి కందుల దుర్గేష్, శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, ఇతర విభాగాల సిబ్బంది కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు వివిధ అభివృద్ధి పనులను సమీక్షిస్తూ గోదావరి పుష్కరాలకు అనుగుణంగా రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా పుష్కరాల సమయంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని సూచించారు. పుష్కరాల నిర్వహణను కుంభమేళా తరహాలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గోపవరం పీపుల్ ట్రీ స్కూల్‌లో విద్యార్థులకు పోలీసుల అవగాహన సదస్సు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**


జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కొవ్వూరు సబ్ డివిజన్ డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో మరియు నిడదవోలు సీఐ తిలక్ ఆధ్వర్యంలో సోమవారం గోపవరం గ్రామంలోని పీపుల్ ట్రీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు సర్కిల్ 'శక్తి టీం' సభ్యులైన ఏఎస్ఐ గంగాధర్, మహిళా పోలీస్ కానిస్టేబుల్ రాజ్యలక్ష్మి, సమిశ్రగూడెం హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు పాల్గొని సుమారు 250 మంది విద్యార్థులకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ పై అవగాహన చిన్నారులపై జరుగుతున్న అకృత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. పోక్సో చట్టంపై వివరణ బాలల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పోక్సో చట్టం గురించి వివరించి, దాని ద్వారా లభించే రక్షణ అంశాలను తెలియజేశారు. సైబర్ నేరాలపై హెచ్చరికలు అపరిచిత వ్యక్తులతో ఫోన్లలో మాట్లాడకూడదని, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి విద్యార్థులు మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. అత్యవసర సేవలపై అవగాహన ఆపద సమయంలో 112 నంబర్‌కు కాల్ చేయడం, 'శక్తి యాప్' వినియోగంపై ప్రాక్టికల్‌గా వివరించారు. ట్రాఫిక్ నియమాలపై సూచనలు మైనారిటీ తీరకముందే వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఉప్పులూరి నరేష్, కరాటే మాస్టర్ వి. శోభన్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆత్మరక్షణ మెళకువలను కూడా వివరించారు.



## డ్రైనేజీ పారకుండా అడ్డకట్టవేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**బుచ్చయ్య పేట జయ జయహే**

బుచ్చయ్యపేట గ్రామంలో గల మురుగనీరు కాలువ నుండి మురుగు ప్రవహించకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకొని మురుగునీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్లం మాజీ సర్పంచ్‌హాగొల్ల గాన రాజారావు ఆధ్వర్యంలో సోమవారం పలువురు మహిళలు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన గొల్ల గాన నాయుడు తదితరులు మురుగునీరు కాలుఅడ్డుగా మట్టి వేయడంతో నీరు రోడ్డుపై నుండి ప్రవహిస్తుందని, మురుగు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పాటు దోమలు వల్ల గ్రామానికి తీవ్రంగా ఉందని , పలువురు గ్రామస్తులు అనారోగ్యానికి వంతులో విరోచనాలకు గురవుతున్నారని తెలిపారు. మురుగునీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలనిహకోరారు.



## సాలూరులో 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన ర్యాలీ

**సాలూరు (జయ జయహే)**

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "డ్రగ్స్ వద్దు బ్రో" 2.0 అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి .కార్యక్రమంలో భాగంగా ప్రజల కోసం చలి వేంద్రం ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి. సాలూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుండి ప్రారంభమైన భారీ అవగాహన ర్యాలీ..యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదు.. బెట్టింగులకు దూరంగా ఉండాలి.. మద్యం మత్తులో మునగకూడదు.. మంచి అలవాట్లుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మంత్రి సంధ్యారాణి పిలుపునిచరు...డ్రగ్స్ అనే సామాజిక సమస్యను నిర్మూలించేందుకు అందరూ కలిసి పనిచేయాలని మంత్రి సంధ్యారాణి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి , ఏఎస్పీ మనీషా రెడ్డి, ,సాలూరు పట్టణ సిఐ అప్పలనాయుడు, ఎస్సైలు, ఈగల్ సిబ్బంది,డాక్టర్ రంభ రజనీకాంత్ మరియు స్థానిక నాయకులు, యువత, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.



## మే నెల ఒకటి నుండి సుందరకాండ ప్రవచన సప్తాహం

**కర్నూలు (జయ జయహే)**

మే నెల ఒకటి నుండి ఏడవ తేదీ వరకు కర్నూలు నగరం, నాగిరెడ్డి రెవిన్యూ కాలనీలో వెలసిన శ్రీ భరతమాత మందిరం నందు ప్రసిద్ధ ఉపన్యాసకులు, మధుర వాచస్పతి గుంటూరు జిల్లా, నంబూరు కాళీవనాశ్రమ ప్రధాన పౌరాణికులు శ్రీనివాస రామానుజ దాసుచే శ్రీమద్రామాయణంలోని సుందరకాండపై ప్రవచన సప్తాహం ఏర్పాటు చేసినట్లు విష్ణు సహస్ర నామ బృందం అధ్యక్షులు మల్లెల పెద్ద పుల్లారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ లను విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పి. కోటేశ్వరరావు, లలితా పీఠం పీఠాధిపతులు సుబ్రహ్మణ్యం స్వామి, తి.తి.దే.హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి తదితరులతో ఆవిష్కరింప చేశారు. సుందరకాండ పారాయణం, శ్రవణం వలన కష్టాలను అధిగమించే శక్తి, ధైర్యం కలుగుతాయని, ఈనాటి సమాజానికి, ప్రత్యేకించి యువతకు హనుమంతుని కార్యదీక్ష, సీతమ్మ చూపించిన ధైర్యసాహసాలు తెలుసుకోవలసిన అవసరం ఉన్నదని, అందుకే ఈ కార్యక్రమాన్ని వారం రోజులపాటు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, భరతమాత సేవా సమితి అధ్యక్షులు సందడి మహేశ్వర్, భరతమాత సేవా సమితి కార్యదర్శి అయోధ్య శ్రీనివాసరెడ్డి, కోశాధికారి మల్లెల పెద్ద పుల్లారెడ్డి, సహ కార్యదర్శి తూముకుంట ప్రతాపరెడ్డి, కార్యవర్గ సభ్యులు శివ శంకర్ రెడ్డి, చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, లావణ్య, అర్చకులు భరద్వాజ్ శర్మ, , శకుంతల, పద్మావతి కాత్యాయనీ, శ్రీలక్ష్మి, విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత జిల్లా ప్రముఖ్ శివకోటి చంద్రశేఖర్, వెల్దుర్తి అభయాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్త రామాంజనేయులు, బొమ్మిరెడ్డిపల్లి శివాలయం ధర్మకర్త లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సీఎం 65వ జన్మదిన వేడుకలు

### గొడుగులు పంపిణీ చేసిన సురేష్ కుమార్

**పాడేరు జయ జయహే**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76 వ జన్మదిన వేడుకలు గబ్బంగి గ్రామంలో ఘనంగా తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహన కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మొదట కేకు కట్ చేసి , రైతన్నలకు, హృద్దులకు, ఆడ పడుచులకు గొడుగులు పంచిపెట్టడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా ఆంధ్రా రాష్ట్రానికి ఆయన ఎంతో సేవ చేస్తున్నారని అన్నారు.



## మద్ది స్వామిని దర్శించుకున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్

**జంగారెడ్డిగూడెం -జయ జయహే**

మద్ది స్వామి దర్శనం ద్వారా ఎంతో మానసిక ప్రశాంతత కలిగిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెంమండలంలోని గుర్వాయిగూడెంలో ఉన్న శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయాన్ని సోమవారం ఎం పి మహేష్ కుమార్ యాదవ్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారినిఆర్ వి చందన ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరంఎం పి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వీరికి వేద ఆశీర్వచనం గావించి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి తీర్థ ప్రసాదాలు అందజేసారు. ఎంపీ తో పాటు తెదేపా జంగారెడ్డిగూడెం టౌన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, రావూరి కృష్ణ, రాజాన పండు,దాకారపు కృష్ణ, రూరల్ అధ్యక్షుడు సి హెచ్ రామలింగేశ్వర రావు, షేక్ ముస్తఫా, చెరికూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం

**విశాఖపట్నం (జయ జయహే)**

బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం ఎంతో అవసరమని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం అన్నారు. మహిళాభివృద్ధి మరియు స్త్రీ శిశు సంక్షేమ విశాఖ జిల్లా శాఖ మరియు చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం, మద్దిలపాలెం అంగన్వాడీ కేంద్రంలు సంయుక్తంగా సోమవారం అక్షయ తృతీయను పురస్కరించుకొని మద్దిల పాలెం శివాలయం ప్రాంగణంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలనలో కేంద్ర,,రాష్ట్ర ప్రభుత్వాల చక్కని కృషి చేస్తున్నాయని అన్నారు,అక్షయ తృతీయ పర్వదినాన అక్కడక్కడా బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని అన్నారు,ముఖ్యంగా హిందూ దేవాలయాలు,చర్చిలు,మసీదుల్లో బాల్య వివాహాలు నిర్మూలనే ధ్యేయంగా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని అన్నారు,ముఖ్యంగా గ్రామ,వార్డ్ స్థాయిలోనే బాలల హక్కుల పరిరక్షణకు మరిన్ని కార్యక్రమాలకు జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖతో చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం మమేకమవుతున్నట్టు చెప్పారు,అనంతరం శివాలయ పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయ ప్రధాన అర్చకులు గాయత్రి శర్మ,చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, యామల యర్రాజి రెడ్డి,టీడీపీ సీనియర్ నాయకుడు ఏ.రమేష్ రెడ్డి,అంగన్వాడీ వర్కర్లు ఆర్.సుబ్బలక్ష్మి, ఎస్.లీలావతి, డి,శశికళ,గుడ్ల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు

# వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నాయకులు

## కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కె.కె రాజు





**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖ వైస్సార్సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన బీజేపీ నాయకులు వైస్సార్సీపీ లో చేరిక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ క్రిస్టియన్ మైనార్టీ స్టేట్ సెక్రటరీగా పనిచేసిన రత్నం లింగం ని ఆయనతో పాటు డా. సురేష్ పిట్ట, మోహన్ బాబు, రమణి, అరుణ, భవాని, గీత, గరచి, శరణ తదితరులుకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజు మాట్లాడుతూ... ఒక గౌరవప్రదమైన ప్రతిపక్ష పార్టీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు మరియు ప్రజలను మోసగించే విధానాలపై నిరంతరం ప్రశ్నిస్తూ పోరాటం కొనసాగిస్తోంది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో, ప్రతిపక్షంగా ప్రజల పక్షాన చిత్తశుద్ధితో పనిచేస్తున్న తీరు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో, బీజేపీ క్రిస్టియన్ మైనార్టీ స్టేట్ సెక్రటరీగా పనిచేసిన రత్నం లింగం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం హర్షణీయ విషయం. వారు భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం మైనార్టీ వర్గాలను కలుపుకొని, వారికి జరుగుతున్న అన్యాయాలు మరియు అక్రమాలపై పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రతిక్షణం ప్రజల సమస్యలపై స్పందిస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేస్తున్న ప్రతిపక్షంగా వైఎస్ఆర్



కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తోంది. కూటమి ప్రభుత్వం సంవత్సరకాలం పూర్తి చేసుకున్న ఈ సందర్భంగా, ప్రజలకు వెన్నుపోటు పొడిచిన విధానాలను వెలుగులోకి తీసుకురావడం కోసం "వెన్నుపోటు దినం పేరుతో" అనే పోరాట కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఈ ఉద్యమం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు చేరుతున్నాయి. ఈ రోజు ప్రభుత్వం ఏ చిన్న మార్పు తీసుకువస్తున్నా, అది ఒక బలమైన, గౌరవప్రదమైన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరియు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరంతర పోరాట ఫలితమే. ప్రజల పక్షాన నిజాయితీగా నిలబడటం మా పార్టీ యొక్క లక్ష్యం. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఎంత మేలు చేయగలిగితే అంత మేలు చేసిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. 2019--2024 కాలంలో అమలు చేసిన సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలు దానికి నిదర్శనం. ఇక ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని సద్వినియోగం చేసుకోకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నట్లయితే, అలాంటి ప్రతి చర్యపై భవిష్యత్తులో కూడా మేము కఠినంగా పోరాటం కొనసాగిస్తాము. ప్రజల ప్రయోజనాలే మా పార్టీకి ప్రథమ ప్రాధాన్యం. అదే దిశగా మా పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు .

# భావితరాల కోసం పాటుపడే నాయకుడు చంద్రబాబు

**గార్లదిన్నె ఏప్రిల్ 20 :(జయ జయహే )**

తరతరాల గుర్తించుకునే గొప్ప నేత చంద్రబాబు అని చల్లా నాగరాజ. సీఎం చంద్రబాబు 76వ జన్మదిన వేడుకల్ని గార్లదిన్నెలో మర్తాడు మాజీ ఉపసర్పంచ్ చల్లా నాగరాజు చీనే కూలీల తో జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మర్తాడు మాజీ ఉపసర్పంచ్ చల్లా నాగరాజు మాట్లాడుతూ..ఎన్టీఆర్ తెలుగుజాతికి ప్రపంచ ఖ్యాతి తీసుకువస్తే, చంద్రబాబునాయుడు తెలుగువారి ప్రతిభను ప్రపంచ నలుమూలలకు పరిచయం చేసారు. ప్రపంచ పటంలో తెలుగు నేలకు ఒక గుర్తింపునిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు చేతులా ప్రజలకు అందించారు. విద్యుత్, ఆర్థిక సంస్కరణలతో దేశానికే దిశానిర్దేశం చేసారు. చంద్రబాబు పాలన అంటే పరిశ్రమలు పరుగెత్తుకుంటూ వస్తాయి. బాబుతోనే జాబుఅన్నది యువత నమ్మకం. సంపద సృష్టి అన్న దాన్ని పాలనలో ప్రవేశపెట్టిన మేధావి చంద్రబాబునాయుడు. తెలుగుదేశం పార్టీ అధినేతగా దేశ రాజకీయాల్లో చంద్రబాబునాయుడు పోషించిన పాత్ర దేశ చరిత్రలో ముఖ్య అధ్యాయం అని చెప్పవచ్చు. రెండు కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటులో, ముగ్గురు



ప్రధానుల ఎంపికలో, ఇద్దరు రాష్ట్రపతుల ఎంపికలో చంద్రబాబు పాత్ర అత్యంత కీలకంగా నిలిచింది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజానాయకులలో 'ది బాస్' అంటే చంద్రబాబునాయుడే.... రాజకీయాల్లో అనుభవం, పరిపాలనలో దూరదృష్టి, అభివృద్ధిపై కట్టుబాటు -- ఇవన్నీ కలిపి నారా చంద్రబాబు నాయుడు ని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయి. బాబు సారధ్యంలో రాష్ట్రం మరింత బలమైన ఆర్థిక పారిశ్రామిక శక్తిగా తయారు కాబోతుందని మర్తాడు మాజీ ఉపసర్పంచ్ చల్లా నాగరాజ అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తాయి రైతు కార్మికులు పాల్గొన్నారు

# అబ్బో...భలే ప్లానింగ్...!

### ముడుపులందుకుని...చక్కగా జారుకున్నారు

### సమాధానం చెప్పే అవకాశమే లేకుండా సెలవు వంక


### ఎప్పుడు చూసినా ఆఫీసులో కనిపించరు

### ఇన్‌ఛార్జిలకు..ఇన్‌ఛార్జిలే గానీ ఏమీ తెలవనట్టు నాటకాలు

### వార్డు సచివాలయాల్లో వింత పోకడలు

**విశాఖపట్నం, ఏప్రిల్ 20, జయ జయహే :**

ప్లానింగ్ అంటే నిజంగా జీవీఎంసీ ప్లానింగే...ప్లానింగు. వార్డు సచివాలయాల్లో ప్లానింగ్ కార్యదర్శులు ఎంతలా ముదిరిపోయారంటే...అబ్బో వీరి ప్లానింగ్ మామూలుగా లేదు. అక్రమ నిర్మాణాలకు రూ. లక్షల్లో దండేసుకుని...ఆ ముడుపుల మూటలతో చక్కగా ఉద్యోగాలకు శెలవులు పెట్టేసి షికార్లు కొట్టేస్తున్నారంటే...అవినీతి సొమ్ముతో ఎంత దర్జాగా తిరుగుతున్నారో ఊహించుకుంటేనే వీరి అక్రమ దందా తేటతెల్లమవుతోంది. ప్లానింగ్ అంటే జీవీఎంసీ ప్లానింగే అనుకుంటారంతా...కానీ ఆ విభాగంలో పని చేసే ఉద్యోగులంతా పక్కా ప్లానింగ్‌తో అందినంతా దోచేసుకుని ఎవరికీ దొరక్కుండా ఎంచక్కా శెలవులు పెట్టేసి అక్రమ నిర్మాణదారులకు ఎలా కొమ్ము కాయాలో అలా కాపాడుతున్నారంటే వారి ప్లానింగ్‌ను ఏ మాత్రం శంకించలేము. వివరాల్లోకి వెళితే జీవీఎంసీ నార్త్ జోన్ పరిధిలోని 11వ వార్డు గురుద్వారా జంక్షన్ దరి ఈపీడీసీఎల్ కార్యాలయానికి ఎదురు సందులో ఓ భారీ అక్రమ నిర్మాణం జరుగుతోంది. ఆ నిర్మాణానికి జీ ప్లస్ టూ నిర్మాణానికి అనుమతిస్తే దానికి రెండు అంతస్తులు అదనంగా వేసి దర్జాగా అక్రమ నిర్మాణం పూర్తి చేసేశారు. ఈ అక్రమ నిర్మాణానికి సమీపంలోనే వార్డు సచివాలయం ఉంది. ఆ సచివాలయంలో అసలు ప్లానింగు సెక్రటరీయే లేరు...అక్కడ విచారణ చేస్తే సీతమ్మధార ఎసఎఫఎస్ స్కూల్ వెనుక సచివాలయంలో ప్లానింగ్ కార్యదర్శి ఉంటారంటూ బీఎస్ లే అవుట్ సచివాలయ కార్యదర్శి తప్పించుకున్నారు. అక్కడికి వెళితే సదరు ప్లానింగ్ సెక్రటరీ సెలవు పెట్టేసి అక్కయ్యపాలెం గణేష్ నగర్ పార్కు ఎదురుగా ఉన్న సచివాలయ కార్యదర్శికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారంటూ చెప్పుకొచ్చారు. అక్కడికి వెళితే తాను మొన్ననే ఛార్జి తీసుకున్నాను కానీ ఇప్పుడు స్లాబ్ వేస్తుంటే చెప్పండి అడ్డుకుంటానంటూ చావు కబురు చల్లగా చెప్పుకొచ్చారు. జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్‌కు ఈ భవన నిర్మాణ సంగతి మొత్తం తెలుస్తుందని మరి కొందరు ప్లానింగ్ కార్యదర్శులు చెప్పుకొచ్చారు. ఆయనేమో చందనోత్సవంలో బిజీగా వున్నారని...రెండు రోజుల వరకూ ఆయన ఎప్పుడు విధులకు వస్తారో చెప్పలేమంటూ ఆ కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ లోగా భవన అక్రమ నిర్మాణం కాస్త సక్రమం అయిపోతోంది. అందుకు ప్లానింగ్ కార్యదర్శులు అందించే పక్కా ప్లానింగేనని తెలుసుకునే లోపు ఆ భవనానికి రంగులు వేసి బిల్డింగ్ పీనలైజేషన్ స్కీంలో దరఖాస్తు చేసేలా ప్లాన్ ఇస్తున్న




అధికారులను ఇంకేమనాలి. ఇవన్నీ ఉన్నతాధికారులకు తెలిసినా వాళ్లు కూడా తమ మామూళ్లు తమకు అందితే చాలన్నట్టుగా ఉంటున్నారన్నది బహిరంగ రహస్యం.



## ఉపాధి పనుల వద్ద

# ఎన్రోల్మెంట్ డ్రైవ్

**చోడవరం ఏప్రిల్ 20 జయ జయహే**

చోడవరం మండలం లక్కవరం హైస్కూల్ సిబ్బంది ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను సోమవారం వినున్నతంగా నిర్వహించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న స్థానిక పెద్ద చెరువు వద్దకు వెళ్లి తమ పాఠశాలలో అడ్మిషన్స్ కొరకు ప్రచారం చేపట్టారు. సుమారు 500 మంది పేరెంట్స్‌ను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయుడు ఓరుగంటి సీతబాబు మాట్లాడుతూ..ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు ఏవిధంగా మెరుగైన విద్యను ఎలా అందిస్తాయో వివరించారు. సచివాలయం కార్యదర్శి గంగాధర్, చెర్మన్ బోధల శ్రీను, వైస్ ఛైర్మన్ రాజు,అంగన్వాడీ సిబ్బంది, టీచర్స్ ఎం.వి స్వామి, ఎంజీవీ సూర్యనారాయణ, గోవింద్, విజయ్, జగదీశ్వరి, బంగారు తల్లి తదితరులు పాల్గొన్నారు.గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ఉనికిని కాపాడటానికి టీచర్స్ చేస్తున్న కృషిని గ్రామస్తులు అభినందించారు.




# బాలల స్వీయ రక్షణే శక్తి టీం అవగాహనలు

### అత్యవసర పరిస్థితుల్లో అండగా పోలీస్ సేవలు

**టెక్కలి ఏప్రిల్ 20 జయ జయహే**

సమాజంలో అనుదిన అవసరాల కోసం బయటకు వెళ్లాల్సిన అవసరాలు ఎన్నో ఉన్నాయి, ఇందులో భాగంగా జాతీయ రహదారులతో పాటు గ్రామీణ ప్రాంత రహదారుల్లో ప్రయాణం చేసే సమయంలో, బాల బాలికలు యువతీ యువకులు స్వీయ రక్షణ కోసం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతో ఉంది ఇందులో భాగంగా టెక్కలిసబ్ డివిజన్ ప్రాంత శీ లోని జలుమూరు మండలం జో నంకి గ్రామం ఎంపీపీ పాఠశాల లో టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం అవగాహన ప్రోగ్రాం టెక్కలి పోలీసుల టీం నిర్వహించారు.జాతీయ రహదారులతో పాటు గ్రామీణ రహదారిలో మోటార్ వాహనాలు డ్రైవింగ్ చేసినప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ తో పాటు హెల్మెట్ ను భరించాలని, దీనివల్ల ఉపయోగాలను ప్రత్యేక చట్టపరమైన రక్షణ అంశాలను శక్తి టీం ప్రతినిధులు బాలలకు స్పష్టంగా తెలిపారు, అత్యవసర పరిస్థితులు ప్రమాదకరమైన ఇబ్బందులు జరిగిన సమయంలో 10 33, 181, 112, 10 91, ఉచిత హెల్ప్ లైన్ నెంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సేవలను బాల్య వివాహాలు కట్టడి, మాద క ద్రవ్యాలను అరి కట్టడం పలు ప్రమాదాల నుంచి బయటపడేలా స్వీయ రక్షణ కోసం శక్తి టీం అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం గిరిధర్, కోటబొమ్మాలి హెడ్ కానిస్టేబుల్ డి శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ కే చామంతి, శ్రీ శాంతి, ప్రధానోపాధ్యాయులు ఎం వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు అనంతరం పాఠశాల ఆవరణలో శక్తి టీం ప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.



## క్షేత్రస్థాయిలో వైయస్సార్సీపి విజయానికి

# సిద్ధం కావాలి

### గ్రామ కమిటీలు పటిష్టంగా పనిచేయాలి

**టెక్కలి ఏప్రిల్ 20 జయ జయహే**

క్షేత్రస్థాయి నుంచి మారుమూల ప్రాంతాల్లో సహితం వైయస్సార్సీపి పటిష్టతకు కార్యకర్తలంతా ఐక్యమత్యంతో కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతానికి అందరూ సిద్ధం కావాలని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త పేరాడ తిలక్ స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మకంగా పార్టీ డిజిటల్ సమావేశాలు నిర్వహించి , కమిటీలను గ్రామస్థాయిలో అత్యంత చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ మేరకు టెక్కలి నియోజకవర్గం పరిధిలోని నందిగాం, మండలం పెద్ద బాణాపురం, కాపు తెంబూరు, పెద ల వుని పల్లి, బడగాం, గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులు, పెద్దలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు, వైఎస్ఆర్సిపి పటిష్టతకు విజయానికి అందరూ ఐక్యమత్యంతో కష్టపడి పనిచేయాలని తిలక్ పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో కనితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, అంబోడి విష్ణు, రోనంకి బాబురావు, పూడి ఆశరాణి, పైల నారం నాయుడు, ఢిల్లీశ్వరరావు, చిరంజీవులు దట్టి కేశవరం, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ శక్తులను పునరేకీకరణ చేస్తూ పునర్నిర్మాణ యజ్ఞం

## జగిత్యాలలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్



- పొదరిల్లు లాంటి రాష్ట్రాన్ని అప్పగిస్తే కేసీఆర్ చావాలా?
- ఈ వెధవలు చావాలని అనుకుంటే నేను చస్తానా?
- కాంగ్రెస్ దోపిడీతో ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరు
- పనిచేయని వారిని లాగులు పగిలేదాకా సంపాలి
- కేసీఆర్ సభలు పెడితేనే రైతుబంధు కిస్తీ ఇస్తారా?
- అధికారంలోకి వచ్చిన వెంటనే హైడ్రా రద్దు చేస్తాం
- జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పదవి
- ప్రజలకు మంచి జరగాలనే బయటకు రాలేదు

**జయజయహే ప్రతినిధి**

'కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యిలా రాష్ట్రాన్ని అప్పగిస్తే కేసీఆర్ చావాలా..? నువ్వు వేయి జన్మలెత్తినా చావను.. పిల్లి శాపాలకు ఉట్టి తెగుతదా..? ఈ వెధవలు చావాలని అనుకుంటే చస్తానా? మీ ఆశీర్వాదాలు ఉంటే అన్ని వర్గాల ప్రజలు గర్వంగా, సంతోషంగా ఉండేలా, అన్ని వర్గాల ప్రజలు బాగుపడేదాకా సేవ చేస్తా. చివరి శ్వాస దాకా 50 ఏండ్ల వారిలా నేనూ, జీవన్‌రెడ్డి ఉత్సాహంతో ముందుకు దూసుకుపోతాం. రాష్ట్రం ఎందుకు బాగుపడదో చూస్తాం' అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. జగిత్యాలలో సోమవారం బీఆర్ఎస్ నిర్వహించిన 'ప్రజా ఆశీర్వాద సభ' వేదికగా ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సుమారు ఏడాది తర్వాత ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టిన కేసీఆర్ గంట పాటు ప్రసంగించారు.

'తెచ్చిన తెలంగాణలో మంచి, చెడు చూసే బాధ్యత నాకు అప్పగిస్తే కొత్త కుండలో ఈగ చొచ్చినట్లు రాష్ట్ర ఆర్థిక స్థితిపై అవగాహన లేకున్నా నిపుణుల సహాయంతో ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి చేశాం. కానీ కేసీఆర్‌కు పాలన చేతకావడం లేదు... మాకు పాలనలో అనుభవం ఉంది. ఆరు చందమామలు, ఏడు సూర్యులను పెడతామని అధికారంలోకి వచ్చి ఆర్థిక పరిస్థితిని దిగజార్చారు. అందువల్ల ప్రజలు సంఘటితమై తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం మొదలు పెట్టాలి. గ్రహచారం బాగాలేదని కూర్చుంటే దెబ్బతింటాం. తెలంగాణ ప్రజలు గెలిచి నిలవాల్సిందే. జగిత్యాల జైత్రయాత్రతో రాజకీయ శక్తులను పునరేకీకరణ చేస్తూ పునర్నిర్మాణ యజ్ఞం ప్రారంభిస్తున్నా.. ముందుకెళ్లి విజయం సాధిద్దాం' అని కేసీఆర్ పేర్కొన్నారు.

'ఉత్తి మాటలు.. గప్పాలు కొట్టుడు కాదు.. మిషన్ భగీరథ ఐదేండ్లలో పూర్తి చేసి నీళ్లు ఇవ్వకపోతే ఓట్లు అడగం అని నిండు అసెంబ్లీలో చెప్పిన సీఎంను ఎవరైనా చూశారా? మరిప్పుడు ఏం రోగం వచ్చింది. పని చేయని వారిని లాగులు పగిలేదాకా సంపాలి. పొదరిల్లు లాంటి తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తిని ఏడు వేల మెగావాట్ల నుంచి 20వేల మెగావాట్లకు పెంచి క్షణం కూడా కరెంటు పోకుండా చేశాం. మరిప్పుడు ఏం బీమారి వచ్చింది. రైతుబంధు కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి. జగిత్యాలలో సభ పెడితే రైతుబంధు రెండో కిస్తీ ఇస్తున్నారు. మూడో కిస్తీ కోసం కేసీఆర్ మరో సభ పెట్టాలా. రైతుబంధు వేసేందుకు కాటారంలో సభ పెట్టారు. రెండు నెలలకోమారు ఎకరానికి ఆరు వేలు వేసి సిపాయిల్లా డప్పు కొట్టుకుంటున్నరు' అని కేసీఆర్ అన్నారు.

**.అందుకే బయటకు రాలేదు**

'బీఆర్ఎస్ పాలనలో తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తే ఇప్పుడు మొక్కజొన్న కొనుగోలు చేస్తారో లేదో కూడా చెప్పడం లేదు. ఉద్యోగులకు 72శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ఇస్తే ఈ ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగుల బకాయిలతోపాటు కనీసం ఏడు శాతం జీతం కూడా పెంచలేదు. ఉచిత బస్సుతో ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పేపర్ తిరగేస్తే సింగరేణి, పౌరసరఫరాలు సహా అనేక కుంభకోణాలు, భూ కబ్జాలు జరుగుతున్న తీరు చూస్తే బాధ కలుగుతోంది. కూల్చివేతలు, కాల్చివేతలు, పోలీసుల దాడులు, అరెస్టుల చుట్టూ రాజకీయం తిరుగుతోంది. బీఆర్ఎస్ అధికారంలోకి రాకున్నా నేను ఒకటి రెండుమార్లు తప్ప బయటకు రాలేదు. ప్రజలు వాళ్లకు అధికారం ఇచ్చారు. మంచి జరగాలని కోరుకున్నా.. కానీ ఎక్కడ చూసినా చిల్లర మాటలు తప్ప ఒక్క నిర్మాణాత్మక కార్యక్రమం, గొప్ప స్కీమ్ లేదు. అందుకే జీవన్‌రెడ్డి లాంటి నాయకుడు "కాంగ్రెస్ పోవాలే.. బీఆర్ఎస్ రావాలే అంటున్నడు"' అని కేసీఆర్ పేర్కొన్నారు.

**మొదటి సంతకంతోనే హైడ్రా రద్దు**

'మేము మూడున్నర లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తే హైడ్రాతో పిల్లలు పుస్తకాలు కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా ఇండ్ల కూల్చివేతలు చేస్తున్నరు. హైడ్రాను జిల్లాల్లో కూడా తెస్తామని పీసీసీ అధ్యక్షుడు చెప్తున్నాడు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మొదటి సంతకంతోనే హైడ్రాను రద్దు చేసి ఎత్తి చెరువులో పడేస్తం' అని కేసీఆర్ మండిపడ్డారు.

**జీవన్‌రెడ్డి.. నేను దగ్గరి మిత్రులం**

'జీవన్‌రెడ్డి గురించి ఎక్కువ చెప్తే మాది మేము డబ్బా కొట్టుకున్నట్లు అయితది. 45 ఏండ్ల నుంచి దగ్గరి మిత్రులం అయినా భిన్న రాజకీయ సిద్ధాంతాల కారణంగా విడివిడిగా పనిచేశాం. కానీ మంచి చెడ్డలు, కష్టసుఖాలు, అభిప్రాయాలు కలిసి పంచుకునే వాళ్లం. జగిత్యాల ప్రాంతం గురించి ప్రాణం పెట్టి పనిచేసిన నాయకుడు జీవన్‌రెడ్డి. నేను సీఎం అయిన తరువాత కరీంనగర్‌లో సభ పెడితే అక్కడికి వచ్చి బోర్నపల్లి బ్రిడ్జి అవసరం అని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అడిగారు. వెంటనే రూ. 80 కోట్లు మంజూరు చేసి బ్రిడ్జి కట్టించిన. ఇటీవల కొన్ని సర్వేలు జరిగితే బీఆర్ఎస్‌లో జీవన్‌రెడ్డి చేరిక ఆటంబాంబుగా పేలడంతోపాటు జగిత్యాలతోపాటు పొరుగు నియోజకవర్గాల్లో ఆయన ప్రభావం ఉంటుందని తేలింది. నేనూ, జీవన్‌రెడ్డి అన్నదమ్ముల్లా, పిల్లర్లుగా పనిచేస్తాం. ఆయన జగిత్యాల, పాత కరీంనగర్ జిల్లాలకే పరిమితం కాకుండా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల బాధ్యతలన్నీ చూసుకోవాలి. అందుకే పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఈ నిమిషం నుంచే అపాయింట్ చేస్తున్నా. ఆరు నూరైనా.. వచ్చేసారి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. ఇది నామాట. జగిత్యాల యుద్ధం కార్యకర్తల వంతు. తెలంగాణ యుద్ధం మా వంతు' అని కేసీఆర్ ప్రకటించారు.



# ఎమ్మెల్యేల ధనదాహానికి ప్రజలు బలి

## మాజీ ఎంపీ భరత్ రామ్ ధ్వజం

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి, కేవలం తమ జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని రాజమండ్రి మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో ఆయన, రాజమండ్రి పరిధిలోని ఐదు ప్రధాన సమస్యలపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన భరత్ రామ్ నగరంలోని ప్రస్తుత పరిస్థితులపై నిప్పులు చెరిగారు. మల్లయ్యపేట ప్రాంతంలో విచ్చలవిడి ఇసుక రవాణా వల్ల ప్రజలు దుమ్ము, ధూళితో రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలను గోదావరి గట్టు వెంబడి మళ్లించాలని, గోరక్షణ పేట రోడ్డును తక్షణమే పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. మోరంపూడి ఫ్లైఓవర్ పూర్తయినా సర్వీస్ రోడ్లు వేయకపోవడం, పుష్కర్ ఘాట్‌లో జారుతున్న టైల్స్ మార్చకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**అక్రమ సంపాదనే ధ్యేయం:**

"గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు అభివృద్ధి కోసం పోటీ పడేవారు. కానీ నేడు కూటమి ఎమ్మెల్యేలు ఇసుక, మద్యం, కొండల తవ్వకాల ద్వారా నెలకు రూ. 2 కోట్లకు పైగా అక్రమంగా సంపాదిస్తున్నారు" అని భరత్ ఆరోపించారు. కోటిలింగాల ఘాట్ వద్ద సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వాటాలు వేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు.

**నియామకాలపై విసుర్లు:**

రాజమండ్రిలో రాజకీయాలు జుగుప్సాకరంగా మారాయని, పేకాట క్లబ్బులు నడిపేవారికి, రౌడీ షీటర్లకు ఆలయ చైర్మన్ పదవులు కట్టబెట్టడం ఏంటని ఆయన ప్రశ్నించారు. కేంద్రం ఇస్తున్న పిఎంఏవై నిధులను వాడుకుని, గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలకు ఇల్లు ఎందుకు నిర్మించడం లేదని నిలదీశారు. ఇంత జరుగుతున్నా ఇటీవల పర్యటించిన ముఖ్యమంత్రి మౌనంగా ఉండటం శోచనీయమని, ప్రజలు ఈ అరాచక పాలనను గమనించి తగిన బుద్ధి చెప్పాలని భరత్ రామ్ పిలుపునిచ్చారు.



# ఏసిబి అధికారులకు చిక్కిన అవినీతి విఆర్వో

**బుచ్చయ్య పేట జయ జయహే**

బుచ్చయ్యపేట మండలం పి. భీమవరం గ్రామంలో ఒక రైతు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు మాటవేసి సోమవారం పి భీమవరం సచివాలయంలో అవినీతి విఆర్ఓ ను పట్టుకున్నారు. భూమి మ్యుటేషన్ సంబంధించి ఒక రైతు నుండి లక్ష 50 వేలు లంచం తీసుకోవడంతో రైతు ఏసి బాధికారుల ఆశ్రయించారు. సోమవారం సచివాలయంలో లంచం తీసుకుంటూ వీఆర్వో పోతల శంకర్రావు అదుపులోకి తీసుకున్నారు .ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీలు హర్షిత ,రమణమూర్తి మాట్లాడుతూ గతంలో ఈ శంకర్రావు పై రెండు సార్లు టూ టైమ్స్ సస్పెండ్ విధించారు అని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే 1064 కి ఫోన్ చేయాలని లేదా ఏసీ అధికారుల సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ సరఫరా చేయరూ

**నక్కపల్లి (జయ జయహే)**



డిఎల్ పురం గ్రామంలో ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్నటువంటి కూలీలకు ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ ఆధ్వర్యంలో వేసవి దప్పికను తీర్చే ప్రయత్నంలో సుమారు 300 సభ్యులకు మజ్జిగ అరటి పండ్లు పంపిణీ చేయుట జరిగినది ప్రతి సంవత్సరము కూడా ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం ఆనవాయితీగా ఉన్నది 2014 2019 సంవత్సరముల మధ్యకాలంలో అప్పటి ముఖ్యమంత్ర నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరపున సదరు కూలీలకు వేసవి కాలం అంతా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టేవారు ఆదర్శంగా తీసుకుని గత ప్రభుత్వ టైంలో గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకటరమణ మరియు క్రీస్తు శేషులు సూర్యనారాయణ రాజు తదితర గ్రామ పెద్దలు అందరూ ఒకరి తర్వాత ఒకరు ఉపాధి కూలీలకు మజ్జిగ మరియు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం చేస్తూ ఉండేవారు మజ్జిగ పండ్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజల వెంకటరమణ ఉపాధి కూలీలతో మాట్లాడుతూ వారందరి తరపున ప్రభుత్వానికి సోషల్ మీడియా ద్వారా చిన్న సూచన విన్నపం చేయుట జరిగింది గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యక్రమంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించి ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా చూసిన ఘనత ఆయనకు దక్కుతుందని అదేవిధంగా ఇప్పుడు మరలా కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి ముఖ్య సారథిగా ఉన్నారు కనుక మరలా వారు ఉపాధి కూలీలను దృష్టిలో ఉంచుకొని వేసవతాపాన్ని తట్టుకునే విధంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టాలని నియోజకవర్గ శాసన సభ్యురాలు ఏపీ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ద్వారా గ్రామీణ జాతీయ ఉపాధి పథకం అమలు చేయుటలో ప్రపంచంలోనే అగ్రమగంగా ఉన్నటువంటి మోడీ నాయకత్వంలో నడుస్తున్నటువంటి ఈ పథకం లో ఉన్నటువంటి చిన్న చిన్న లోపాలను సరి చేస్తూ వేసవిని దృష్టిలో పెట్టుకొని పనిగంటలు కూడా తగ్గించి మెరుగైన సదుపాయాలు చేయాలని ఆ గ్రామ మాజీ ఎంపిటిసి గింజల వెంకటరమణ కోరుచున్నారు

# తిరుమల యాత్రికుడికి జిల్లా ఎస్పీ అండ

## దివ్యాంగుడి పట్టుదలకు నరసింహ కిషోర్ ఫిదా

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

సంకల్పం ఉంటే అంగవైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్న ఒక దివ్యాంగుడి భక్తి యాత్రకు తూర్పుగోదావరి జిల్లా పోలీసు యంత్రాంగం అండగా నిలిచింది. ఇచ్ఛాపురం నుండి తిరుమల వరకు మూడు చక్రాల సైకిల్‌పై యాత్ర చేస్తున్న నెయ్యల ప్రసాద్ అనే దివ్యాంగుడిని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డి. నరసింహ కిషోర్, అభినందించి, ఆర్థిక సాయం అందజేశారు.

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి బయలుదేరిన నెయ్యల ప్రసాద్, తన మూడు చక్రాల సైకిల్‌పై తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ నరసింహ కిషోర్ స్వయంగా తన కార్యాలయం నుండి బయటకు వచ్చి ప్రసాద్‌ను పలకరించారు. ఆయన యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్న ఎస్పీ, ఇంతటి ఎండలో సుదూర ప్రాంతానికి సైకిల్‌పై ప్రయాణించడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**అండగా నిలిచిన పోలీస్ బాస్:**


నెయ్యల ప్రసాద్ ఆత్మవిశ్వాసాన్ని చూసి ముగ్ధులైన ఎస్పీ నరసింహ కిషోర్, ఆయన ప్రయాణ ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ. 5,000/- నగదు అందజేశారు. కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా, మార్గమధ్యంలో ఎటువంటి ఆపద ఎదురైనా నేరుగా తనను సంప్రదించాలని సూచిస్తూ తన వ్యక్తిగత ఫోన్ నంబర్‌ను కూడా ప్రసాద్‌కు అందజేశారు. ఎస్పీ చూపిన ఈ మానవత్వం ఆ దివ్యాంగుడిలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది.

**సమాజానికి స్ఫూర్తి:**

ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ.. "శారీరక వైకల్యం ఉన్నప్పటికీ, దృఢ సంకల్పంతో పవిత్ర యాత్రను చేపట్టడం అభినందనీయం. భక్తి, పట్టుదలతో ముందుకు సాగే ప్రసాద్ వంటి వ్యక్తులు సమాజానికి గొప్ప స్ఫూర్తిగా నిలుస్తారు. ఆపదలో ఉన్నవారికి చేతనైన సహాయం అందించడం ప్రతి పౌరుడి బాధ్యత. పోలీసు శాఖ కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే కాకుండా, ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటుంది" అని పేర్కొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఎస్పీ స్వయంగా వచ్చి తనను పలకరించి, సాయం అందించడం పట్ల నెయ్యల ప్రసాద్ భావోద్వేగానికి లోనయ్యారు. ఎస్పీ గారి భరోసా తన యాత్రలో కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఖచ్చితంగా, వార్తా పత్రికలలోని "మెయిన్ ఎడిషన్" లేదా లి"డిస్ట్రిక్ట్ పుట"లిలో వచ్చే శైలిలో మరో కథనం ఇక్కడ ఉంది:





### మునగాకు చేసే మేలు తెలిస్తే..

# తినకుండా ఉండరు

మనకు ప్రకృతి ఎన్నో విధాలుగా సాయపడుతుంది. ప్రకృతిసిద్ధంగా లభించే చెట్ల ద్వారా మనకు ఆహారంతోపాటు ఔషధాలు కూడా మెండుగా లభిస్తాయి. ఆహారంగా ఉపయోగపడే కొన్ని మొక్కలు మన ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. అలాంటి వాటిలో మునగ కూడా ఒకటి. మరి మునగాకుతో కలిగే ఆ ప్రయోజనాలు ఏంటో చూద్దాం.. మనకు ప్రకృతి ఎన్నో విధాలుగా సాయపడుతుంది. మునగాకును ఆకు కూరగానో, పప్పులో కలెగూరగానో లేదంటే పచ్చడిగానో చేసుకుని తినడంవల్ల ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. మరి మునగాకుతో కలిగే ఆ ప్రయోజనాలు ఏంటో చూద్దాం..

**ప్రయోజనాలు..**

వర్షాకాలంలో మునగాకును ఎక్కువగా వాడటంవల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. అంతేగాక ఈ కాలంలో తరచుగా వచ్చే జలుబు, దగ్గులాంటి ఇబ్బందుల నుంచి కూడా బయటపడవచ్చు. పాలకూరతో పోలిస్తే మునగాకులో మూడు రెట్లు ఎక్కువగా ఐరన్ ఉంటుంది. అరటిపండు కంటే ఏడు రెట్లు ఎక్కువగా మెగ్నీషియం లభిస్తుంది. పాలల్లో కంటే రెండు రెట్లు ఎక్కువగా ప్రొటీన్లు ఉంటాయి. ఈ ఇనుము, మెగ్నీషియం మనల్ని త్వరగా అలసటకు గురికాకుండా చేస్తాయి.
మునగాకులో ఎక్కువగా ఉండే పీచువల్ల కాస్త తినగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల మునగాకును నిత్యం వాడటంవల్ల అతిగా తినడం అనే సమస్య తీరుతుంది.
మునగాకులో ఉండే క్లోరోజనిక్ ఆమ్లం కొవ్వును కరిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది.
శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో సాయపడుతుంది.
మునగలోని విటమిన్-ఎ చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది.
మునగాకులోని అమైనో ఆమ్లాలు ప్రొటీన్ ఉత్పత్తికి తోడ్పతాయి. ఈ ప్రొటీన్ జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది.
మలబద్ధకాన్ని నివారిస్తుంది.
కడుపులోని పుండ్లు, ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది.



### నోటి మంట..

# వంటింటి చికిత్స

వేడి వేడి సమోసానో, గరం గరం చాయ్‌నో నోట్లో పెట్టుకోగానే కాలడం అందరికీ అనుభవమే. నిజానికి ఇది చిన్న అసౌకర్యం మాత్రమే. కొన్ని గంటలో, ఒకట్రెండు రోజులో బాధించే ఈ సమస్య పరిష్కారానికి ఇంటి చిట్కాలు కొన్ని ఉన్నాయి.
నోరు కాలినప్పుడు చల్లటి పాలు తాగితే మంట నుంచి ఉపశమనం కలుగుతుంది. పాలలో కేసిన్ లాంటి ప్రొటీన్లు ఉంటాయి. ఇవి కాలిన కణజాలంపై పూతగా అమరిపోతాయి. దాంతో మనకు ఉపశమనం లభిస్తుంది. చల్లటి పాలను కొద్దికొద్దిగా తాగుతూ కొన్ని సెకండ్ల పాటు నోట్లోనే ఉంచుకుని మింగేస్తే మంచి ఫలితం ఉంటుంది.
నోరు కాలిన సందర్భాల్లో తేనె కూడా గొప్ప ప్రయోజనాన్ని ఇస్తుంది. యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి కాబట్టి తేనెను కాలిన చోట పూస్తే బాధ చాలావరకు తగ్గిపోతుంది. ఒక చెంచాడు తేనె తీసుకుని కాలిన చోట పూతలా పూసి నోట్లో నెమ్మదిగా కరిగిపోనివ్వాలి. రోజంతా తరచూ ఇలా చేస్తుండాలి.
కాలిన గాయాల చికిత్సలో నెయ్యిని వందల ఏండ్లుగా ఉపయోగిస్తూనే ఉన్నారు. దీనికున్న చల్లబరిచే గుణాలు నోటి మంటకూ ఉపశమనం కలిగిస్తాయి. వేలిని శుభ్రం చేసుకొని, నెయ్యి అద్దుకొని నోట్లో కాలిన చోట పూతగా రాయాలి. కాలిన వెంటనే ఇలా చేస్తే మంచిది.
కలబందకు చల్లబరిచే, గాయాలను తగ్గించే గుణాలు ఉన్నాయి. వేడి కారణంగా నోరు కాలితే వెంటనే కలబంద గుజ్జును పూయాలి. దీంతో మంట తగ్గిపోతుంది. తొందరగా ఉపశమనం దొరుకుతుంది.
అధిక వేడి వల్ల నోరు కాలినప్పుడు పెరుగు కూడా మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది. చల్లదనం, పొరలా ఉండే లక్షణం కాలిన కణజాలాన్ని బాగుచేసి మంటను తగ్గిస్తుంది. ఓ చెంచాడు పెరుగు తీసుకుని కొన్ని సెకండ్లపాటు నోట్లో ఉంచుకొని మింగేయాలి.
చక్కెర నోట్లో వేసుకున్నా మంచి ఫలితమే కనిపిస్తుంది. చక్కెర నోట్లో లాలాజలం ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. కాబట్టి నోరు కాలిన సందర్భాల్లో కొంచెం చక్కెరను నోట్లో వేసుకోవాలి. నెమ్మదిగా కరిగిపోయేలా చప్పరించాలి. ఈ చిట్కా కూడా త్వరిత ఉపశమనాన్ని ఇస్తుంది.

# అమ్మ కడుపులోనే.. సంరక్షణ



**ఫీటల్ మెడిసిన్ కవచం**

గర్భధారణ మహిళల జీవితంలో అతి మధురమైన ఘట్టం. తమకు పుట్టిన బిడ్డ పూర్తి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటారు. కానీ, కొంతమందికి దురదృష్టవశాత్తు అవయవ లోపాలు, వంశపారంపర్య వ్యాధులు తదితర సమస్యలతో కూడిన బిడ్డలు జన్మించడం జరుగుతుంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లల గురించి బాధపడే దుస్థితి తలెత్తుతుంది. ఇలా పలురకాల అనారోగ్యాలు, లోపాలను గర్భంలో ఉన్నప్పుడే గుర్తించి వారికి తగిన చికిత్స అందించాలన్నా, లేదా నయంకాని సమస్యలు, లోపాలు ఉన్న పిండాన్ని గుర్తించి దాన్ని తొలగించాలన్నా కడుపులో బిడ్డ ఊపిరి పోసుకోకముందే పిండం ఆరోగ్యస్థితిని గుర్తించాల్సి ఉంటుంది. గర్భంలో ఉన్న పిండం పూర్తి ఆరోగ్య స్థితిని క్షుణ్ణంగా తెలుసుకుని, అవసరమైన చికిత్స అందించడాన్నే ఫీటల్ మెడిసిన్ అంటారు. ఈ ఫీటల్ మెడిసిన్ అనేది ప్రతి గర్భిణికి అవసరమా,

దీని ద్వారా ఏయే సమస్యలను గుర్తించవచ్చు, ఎలాంటి చికిత్స అందించవచ్చు, దీనివల్ల కలిగే లాభాలు మొదలైన అంశాల గురించి తెలుసుకుందాం..

**గర్భధారణ... మహిళల జీవితంలో అతి మధురమైన ఘట్టం. తమకు పుట్టిన బిడ్డ పూర్తి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటారు. కానీ, కొంతమందికి దురదృష్టవశాత్తు అవయవ లోపాలు, వంశపారంపర్య వ్యాధులు తదితర సమస్యలతో కూడిన బిడ్డలు జన్మించడం జరుగుతుంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లల గురించి బాధపడే దుస్థితి తలెత్తుతుంది.**

గర్భంలోనే పిండానికి చికిత్స అందించే విధానాన్ని ఫీటల్ మెడిసిన్‌గా పరిగణిస్తారు. ఇందులో భాగంగా శిశువు పిండదశలో ఉన్నప్పుడే స్క్రీనింగ్ చేస్తారు. దీంతో పుట్టబోయే శిశువుకు ఉండే సమస్యలు, భౌతిక లోపాలు, జన్యులోపాలు వంటివాటిని గుర్తించి నిర్ధారించవచ్చు. పది పదిహేనేండ్ల కింద ఈ విధమైన వెసులుబాటు లేదు. దీంతో చాలామంది తల్లిదండ్రులు బిడ్డ పుట్టిన తరువాత చికిత్స అందించడం, కొన్ని రకాల లోపాలతో జన్మించిన శిశువుల భవిష్యత్తు గురించి బాధపడటం జరిగిపోయేవి.

కానీ, ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో పుట్టబోయే బిడ్డకు ఉన్న వ్యాధులు, లోపాలను గర్భంలో పిండదశలోనే గుర్తించవచ్చు. ఆ సమస్యలకు అవసరమైన చికిత్స కూడా పిండదశలోనే అందిస్తూ ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చే విధంగా చూడవచ్చు. పైగా తలసేమియా వంటి నయం చేయలేని సమస్యలు ఉన్న పిండాలను చట్టబద్ధంగా తొలగించే వెసులుబాటు ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, తమ ఆరోగ్యంతోపాటు పుట్టబోయే బిడ్డల ఆరోగ్యంపై దృష్టిపెడుతున్న తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతున్నది. దీంతో ఫీటల్ మెడిసిన్‌కు కూడా డిమాండ్ పెరుగుతున్నది.

**స్కానింగ్ కీలకం**

ఫీటల్ మెడిసిన్‌లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ అనేది అత్యంత కీలకం. ఇందులో వచ్చే ఫలితాలు స్కానింగ్ జరిపే ఆపరేటర్‌పై ఆధారపడి ఉంటాయి. అంటే స్కానింగ్‌ను సరైన పద్ధతిలో జరపాల్సి ఉంటుంది. అందుకోసం నిష్ణాతుడైన ఆపరేటర్ ఉండాలి. సాధారణంగా డయాగ్నోసిస్ అనేది సమస్యను మాత్రమే గుర్తిస్తుంది. కాని ఫీటల్ మెడిసిన్‌లో డయాగ్నోసిస్‌తోపాటు అవసరమైన సలహాలు, సూచనలు, కౌన్సెలింగ్, క్లినికల్ పార్ట్ వంటివి కూడా ఇమిడి ఉంటాయి. స్కానింగ్ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి లో రిస్క్‌గ్రూప్. రెండవది హై రిస్క్ గ్రూప్. వీరిలో కొన్ని స్కానింగ్ పరీక్షలు రెండు గ్రూపుల వారికి కూడా చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఎన్‌టీ, ఎనామలి స్కానింగ్‌లు ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా అవసరమవుతాయి.

**లోరిస్క్‌గ్రూప్ వారికి పరీక్షలు**

లోరిస్క్ గ్రూప్ వారికి 11- 13 వారాల్లో ఎన్‌టీ స్కాన్, 20-22 వారాల్లో మరో ఎన్‌టీ స్కాన్ చేయాల్సి ఉంటుంది. 11-13 వారాల్లో చేసే ఎన్‌టీ స్కాన్‌లో జెనెటికల్, క్రోమోజోమ్ లోపాలను గుర్తించవచ్చు.

**రిస్క్‌గ్రూప్స్ అంటే?**

రుమాటో ఆర్థరైటిస్, ఆటోఇమ్యూన్ డిజార్డర్, డయాబెటిస్, ఊబకాయం, బీపీ, మేనరికం వివాహాలు, ఆలస్యంగా పెళ్లవడం, గుండె సమస్యలు, జెనెటికల్ డిజార్డర్స్ తదితర సమస్యలు ఉన్న మహిళలు రిస్క్ గ్రూప్ కిందికి వస్తారు. వీరందరికీ ప్రతి స్కానింగ్ కూడా చాలా ముఖ్యం. ఆయా స్కానింగ్స్‌లో ఫీటల్ స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. ఈ రిస్క్ గ్రూప్ వారికి 7- 8 వారాల్లో వయబిలిటీ స్కాన్ కూడా అవసరం. వయబిలిటీ స్కాన్‌లో ఫీటల్ (పిండం) గుండె కొట్టుకోవడం, దాని ఎదుగుదల గురించి తెలుసుకుంటారు. అంతేకాకుండా పిండం గర్భసంచిలో ఉందా లేదా, ఫాలోపియన్ ట్యూబులో ఉందా కూడా ఈ పరీక్షతో నిర్ధారించుకోవచ్చు.

పిండం కొన్నిసార్లు ట్యూబ్‌లో ఇరుక్కుపోతుంది. దీనివల్ల పిండంలో ఎదుగుదల లేక గర్భంలోనే శిశువు మృత్యువాత పడే ప్రమాదం ఉంటుంది. పిండం గర్భసంచిలోనే ఉండాలి. అందుకే పిండం స్థానాన్ని తెలుసుకునేందుకు కూడా ఈ వయబిలిటీ స్కాన్ చాలా ఉపయోగపడుతుంది. రిస్క్ గ్రూప్ కిందికి వచ్చే మేనరికం వివాహాలు చేసుకున్న వారు గర్భం దాల్చే ముందు పరీక్ష చేయించుకోవడం ఉత్తమం.

**న్యూకల్ ట్రాన్స్‌ల్యూసెన్సీ (ఎన్‌టీ) స్కాన్**

పిండం 11-13 వారాల వయసప్పుడు చేసే స్కాన్‌ను న్యూకల్ ట్రాన్స్‌ల్యూసెన్సీ లేదా ఎన్‌టీ స్కాన్ అంటారు. ఇందులో పిండం మెడ వెనకాల చర్మం కింద ఉండే ఫ్లూయిడ్స్ మందాన్ని తెలుసుకోవచ్చు. సాధారణ శిశువులో మెడ వెనకాల ఉన్న చర్మం కింద ఫ్లూయిడ్ 2.3 నుంచి 2.4 మిల్లీమీటర్లు ఉంటుంది. అంతకంటే ఎక్కువ ఉంటే చర్మంపై వాపు వస్తుంది. ఈ వాపు గుండె సమస్య లేదా క్రోమోజోమ్ లోపం, జెనెటిక్ లోపం వల్ల వచ్చే అవకాశం ఉంటుంది.

ఈ స్కాన్ ఆధారంగా శిశువులో క్రోమోజోమ్, జన్యులోపం, గుండె సమస్యలను గర్భంలో ఉన్నప్పుడే గుర్తిస్తారు. ఈ పరీక్ష ప్రతి ఒక్కరికీ అవసరం. అదే సమయంలో డబుల్ మార్కర్ బ్లడ్ టెస్ట్ కూడా చేస్తారు. ఇది క్రోమోజోముల లోపాల్ని 90 శాతం కచ్చితంగా గుర్తిస్తుంది. 70 శాతం వరకు స్ట్రక్చరల్ లోపాలు%ా% అంటేపుట్టబోయే శిశువు భౌతిక లోపాలను సైతం గుర్తించవచ్చు.

**అనామలీ స్కాన్ లేదా టిఫా స్కాన్**

టిఫా స్కానింగ్ 20- 22 వారాలప్పుడు చేస్తారు. ఇది కూడా చాలా ముఖ్యమైన స్కానింగ్. ఇందులో పిండం తల నుంచి కాలు వరకు ప్రతి అవయవాన్నీ పరీక్షిస్తారు. మెదడు, తల, ముఖం, మెడ, వేళ్లు, వెన్నెముక, గుండె, ఊపిరితిత్తులు, కాళ్లు , చేతులు, మాయ, నీరు, కదలికలు, గర్భశాయ ముఖద్వారం కూడా చూడవచ్చు. అంతేకాకుండా ఈ స్కానింగ్‌లో సర్వైకల్ లెంగ్త్ కూడా తెలుసుకోవచ్చు. టిఫా, ఎన్‌టీ స్కాన్‌లు ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా చేయాల్సిన పరీక్షలు.

**క్లిష్ట పరిస్థితుల్లో చేయాల్సిన స్కాన్స్**

**ఫీటల్ ఇకో కార్డియోగ్రఫి**

ఫీటల్ ఇకో కార్డియోగ్రఫీ స్కానింగ్‌ను 22- 24 వారాల్లో జరుపుతారు. ఇందులో భాగంగా గర్భసంచిలో ఉన్న శిశువుకు గుండె పరీక్ష చేస్తారన్నమాట. ఇది తల్లిదండ్రుల ఆరోగ్య నేపథ్యం ఆధారంగా 16- 17 వారాల్లో కూడా ఈ ఫీటల్ ఇకో కార్డియోగ్రఫీ చేస్తారు. కుటుంబంలో ఎవరికైనా గుండె సమస్యలున్నా, తల్లి ఆటోఇమ్యూన్ రోగి అయినా, 11- 13 స్కాన్‌లో వాపు ఉన్నప్పుడు ఈ ఫీటల్ ఇకో కార్డియోగ్రఫీ అవసరం ఉంటుంది. కవలలు ఉన్నా కూడా ఈ పరీక్షకు వెళ్లాలి. ఈ పరీక్షలో గుండె పనితీరు, రక్తం గుండెలోపలికి, వెలుపలికి ప్రవహించడం (ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో), రక్త ప్రసరణలో ఏదైనా లీకేజ్, పంపింగ్ సామర్థ్యం వంటివి సవ్యంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తారు. భారతీయ చట్టాల ప్రకారం 24 వారాల్లోపు మాత్రమే అబార్షన్ చేయడానికి అవకాశం ఉంది. కాబట్టి, ఆలోపు మాత్రమే ఈ పరీక్షలన్నీ చేయాలి.

**నాన్ ఇన్వేజివ్ ప్రీనేటల్ టెస్ట్ (ఎన్‌ఐపీటీ)**

నాన్ ఇన్వేజివ్ ప్రీనేటల్ టెస్ట్‌ను 10 వారాల తర్వాత చేయవచ్చు. ఈ పరీక్ష ద్వారా పిండంలో డౌన్ సిండ్రోమ్‌ను 99 శాతం గుర్తించవచ్చు. ఒకవేళ డౌన్ సిండ్రోమ్ ఉన్నట్టు తేలితే అప్పుడు సమస్యను 100 శాతం కచ్చితంగా నిర్ధారించేందుకు ఇన్వేజివ్ టెస్ట్ అవసర పడుతుంది. ఎన్‌ఐపీటీలో భాగంగా తల్లి రక్తం తీసుకుని అందులోంచి పిండం డీఎన్‌ఏను వేరుచేస్తారు. ఆ తర్వాత 5 క్రోమోజోమ్‌ల పనితీరు అంటే%ా% 21వ క్రోమోజోమ్, 18, 13వ క్రోమోజోమ్, ఎక్స్, వై కోమోజోమ్‌ల పనితీరుతోపాటు డౌన్ సింక్రోమ్‌ను గుర్తిస్తారు. డౌన్ సిండ్రోమ్ మానసిక రుగ్మతలైన బుద్ధిమాంద్యం, మెదడులో ఎదుగుదల లేకపోవడం వంటి లోపాల కిందికి వస్తుంది. అయితే ఈ పరీక్షలో సమస్యను 99 శాతం వరకు మాత్రమే గుర్తించే వీలు ఉంటుంది.



**ఇన్వేజివ్ టెస్ట్**

ఎన్‌ఐపీటీలో ఏదైనా సమస్యను గుర్తించినప్పుడు ఇన్వేజివ్ టెస్ట్ చేయాలి. దీనిద్వారా సమస్యను 100 శాతం కచ్చితంగా నిర్ధారించవచ్చు. ఈ పరీక్షలో భాగంగా సూది సాయంతో మాయలోని 'విలై'ని తీసి ల్యాబ్‌లో పరీక్షిస్తారు. ఇన్వేజివ్ టెస్ట్ రెండు రకాలు. ఒకటి కొరియోనిక్ విల్లోస్ సాంప్లింగ్. ఇది 11-14 వారాల్లో చేస్తారు. రెండోదైన అమ్నియోసెంటెసిస్ టెస్ట్‌ను 16 నుంచి 20 వారాల్లో చేస్తారు. ఈ పరీక్షల ద్వారా పిండం గుండెలో ఉన్న లోపాలు, రంధ్రం వంటి సమస్యలే కాకుండా భౌతిక పరమైన ఆకృతి లోపాలు, తలసేమియా వంటి రక్త సంబంధిత లోపాలనూ గుర్తించవచ్చు. అంతేకాకుండా జెనెటిక్ లేదా స్ట్రక్చరల్ లోపాలను కూడా నిర్ధారించవచ్చు. ఈ పరీక్ష ద్వారా గర్భం ఉంచాలా లేక తొలగించాలా అనేది నిర్ణయిస్తారు. పై స్కానింగ్, టెస్టులన్నీ 24 వారాల్లోపే పూర్తి చేయాల్సి ఉంటుంది.

**ట్విన్స్ క్లినిక్ లేదా మల్టిపుల్ ప్రెగ్నెన్సీ**

ముగ్గురు లేదా నలుగురు శిశువులు ఉన్నవారిని ట్విన్స్‌కు (ఇద్దరికి) కన్వర్ట్ చేస్తారు. దీనినే ఫీటల్ రిడక్షన్ అంటారు. గర్భం ధరించిన 11- 13 వారాల్లో అంటే ఎన్‌టీ స్కాన్ సమయంలోనే ఫీటల్ రిడక్షన్ చేయాల్సి ఉంటుంది. ఐడెంటికల్, నాన్ ఐడెంటికల్ ట్విన్స్‌కి కచ్చితంగా ఫీటల్ మెడిసన్ అవసరం. లేజర్ సర్జరీతో మాయను వేరుచేస్తారు. దీనిని లేజర్ థెరపీ అంటారు. ప్రతి 2 వారాలకు స్కానింగ్ అవసరం.

**బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్**

సాధారణంగా తల్లిది నెగెటివ్ బ్లడ్‌గ్రూప్ ఉన్నప్పుడు శిశువు పాజిటివ్ ఉంటే అప్పుడు శిశువు ప్రాణాలకే ప్రమాదకరం. ఇలాంటి శిశువుకు ఇంట్రాయూటరైన్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేయవచ్చు. అంటే గర్భంలో ఉన్నప్పుడే పిండానికి రక్తం ఎక్కించవచ్చన్నమాట. ఇది 95 శాతం వరకు ఫలితాలను ఇస్తుంది.

**గ్రోత్, డాప్లర్ టెస్ట్**

గ్రోత్, డాప్లర్ టెస్టులను 7 నెలల సమయంలో చేయాల్సి ఉంటుంది. గర్భంలో శిశువు ఎదుగుదల, మాయ పెరగకపోవడం, రక్త ప్రసరణ లోపాలు వంటివి గుర్తిస్తే వెంటనే ప్రసవం చేయాలి. ప్రస్తుతం గర్భంలో ఉన్న పిండానికి చికిత్స అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో గర్భంలో ఉన్న పిండానికి ఫీటల్ సర్జరీ కూడా సాధ్యమవుతుంది. ప్రస్తుతం ఈ పరిజ్ఞానం విదేశాలో ఆచరణలో ఉంది. త్వరలోనే భారత్‌లో కూడా అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com